నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644

నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

బుద్ధిబలమునున్న భువిలోన జూడగా
కాకులోలె వదురు లోకులెల్ల
పళ్ళ చెట్టుకేను రాళ్ళదెబ్బలు సుమ్ము
విజయలక్ష్మి వాక్కు వినుర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 35 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 12-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# దద్దరిల్లిన పశ్చిమాసియా..



- ఇరాన్‌పై విరుచుకుపడ్డ అమెరికా
- గల్ఫ్‌లోని అమెరికా బేస్‌లపై ఇరాన్ ప్రతికార దాడులు
- ఈ అర్ధరాత్రి భారీ దాడి అని డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక
- వెనెజువెలాలో మాదిరిగానే ఇరాన్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుంటామని ప్రకటన

వాషింగ్టన్,
క్షిపణి దాడులు, బాంబు పేలుళ్లతో పశ్చిమాసియా మళ్లీ దద్దరిల్లింది. ఇరాన్‌పై మరోసారి అమెరికా భీకర దాడులకు దిగింది. ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఆత్మరక్షణ కోసమే ఈ దా డులు చేశామని తెలిపింది.

-మిగతా 2 లో

# పీవోకే మళ్లీ రక్తసిక్తం..



- నిరసనకారులపై సైన్యం కాల్పులు
- 16 మంది మృతి, 37 మందికి గాయాలు.. ఈ
- పిండి, బియ్యం, కరెంట్ ధరల తగ్గింపుకై రోడ్డెక్కిన 70 వేల మంది పౌరులు
- వారం రోజుల్లో 53 మంది బలి..
- పీవోకేలో ఆగని పాక్ ఆర్మీ అణచివేత చర్యలు
- పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెల్లువెత్తిన ఆగ్రహం.. స్వచ్ఛందంగా బంద్ ముఖం

రావలకోట్,
పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని రావలకోట్‌లో నిరసనకారులపై భద్రతాదళాలు జరిపిన కాల్పుల్లో 16 మంది మృతి చెందారు. తమకు మరిన్ని పౌర హక్కులు కల్పించాలని, నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని ఈద్గా మైదానంలో జరిగిన నిరసన ప్రదర్శనపై భద్రతా దళాలు కాల్పులు జరిపాయి.

-మిగతా 2 లో



# గృహిణులు దేశ నిర్మాతలు..

- ఇంటి పనిని తక్కువగా చూడలేం..
- వారి సేవలు వెలకట్టలేనివన్న సర్వోన్నత న్యాయస్థానం
- నైపుణ్యం లేని పనిగా భావించడం సరికాదు..
- వారికి నెలకు రూ.30,000 పరిహారం చెల్లించాల్సిందే: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ
దేశంలో గృహిణుల శ్రమపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గృహిణులు దేశ నిర్మాతలు అని, వారు చేసే పనికి కనీసం రూ.30,000 పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రోడ్డు ప్రమాదాల్లో గృహిణులు మరణించినా, వైకల్యం సంభవించినా నెలకు కనీస పరిహారం కింద ఈ మొత్తం చెల్లించాలని సూచించింది. సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ సంజయ్ కరోల్, కే కోటిశ్వర్ సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది. రోడ్డు ప్రమాదాల్లో ఎవరైనా మరణించినా లేదా వైకల్యం సంభవించినా బాధితుల ఆదాయం వంటి వివరాల ఆధారంగా కూడా ఇన్సూరెన్స్ కంపెనీలు పరిహారం అందిస్తాయి.ఈ నేపథ్యంలో ఒక కేసుకు సంబంధించి సుప్రీం కోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. రోడ్డు ప్రమాదాల్లో గృహిణులు మరణిస్తే బాధితులకు నెలకు రూ.30,000 పరిహారం అందించాలని ఆదేశించింది.

-మిగతా 3 లో

# రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి


## ప్రధాని మోడీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

- 7 కారిడార్లలో రూ. 38,595 కోట్లతో మెట్రో విస్తరణ ప్రతిపాదనలు
- ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల నిర్మాణానికి ఒకేసారి అనుమతులు
- హైదరాబాద్-అమరావతి-బందరు పోర్టు 12 లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేకు విజ్ఞప్తి
- గోదావరి జలాల వినియోగంపై మహారాష్ట్రతో చర్చలకు కేంద్రం సహకరించాలి
- వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనుల ప్రారంభంపై ప్రధానితో సీఎం ముఖ్య చర్చ
- ఐఐఎం ఏర్పాటుకు 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్రం సిద్ధం

తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం పూర్తి సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్రమోదీని కోరారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్--అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే, గోదావరి జలాల వినియోగం, వరంగల్ విమానాశ్రయం, ఐఐఎం ఏర్పాటు వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి కేంద్ర అనుమతులు, సహకారం కోరారు.

3 లో





# అద్దె భవనాలకు ఇక స్వస్తి

- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు
- ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్ జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): : రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్ మరియు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ భవనాలను హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రిగారు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవిన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్/ రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అ÷–దదె భవనాల్లో కొనసాగుతున్నాయి,

-మిగతా 2 లో



# తొలి వానకే చేతులెత్తేసిన సర్కార్

- నైరుతి రుతుపవనాల రాకతో హైదరాబాద్‌లో భారీగా కురిసిన తొలి వాన
- చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయమయ్యాయన్న కేటీఆర్
- కాంగ్రెస్ సర్కార్ కేవలం రాజకీయాలపైనే దృష్టి పెడుతోందని విమర్శ

తెలంగాణ బ్యూరో, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నైరుతి రుతుపవనాల రాకతో హైదరాబాద్‌లో కురిసిన తొలి పెద్ద వానకే నగరం అతలాకుతలమైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. 'తొలి వానకే చేతులెత్తేసిన సర్కార్' అంటూ సోషల్ మీడియా వేదికగా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ శాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నగర

-మిగతా 3 లో



# నైరుతి మందగమనం

- కేరళ తీరాన్ని తాకిన తర్వాత నైరుతి రుతుపవనాల వేగంలో మార్పు
- ప్రారంభంలో బలంగా ఉన్న రుతుపవనాల పురోగతి తర్వాత మందగింపు
- మధ్య, పశ్చిమ, వాయవ్య ప్రాంతాల్లో వర్షాల కోసం కొనసాగుతున్న ఎదురుచూపులు
- అరేబియా--బంగాళాఖాతంలో అల్పపీడనాల లోటే ప్రధాన కారణమని స్కైమెట్ అంచనా
- వాతావరణ వ్యవస్థల బలహీనతతో రుతుపవనాల కదలికలు అసమానంగా మార్పు

2 లో

జూన్ 4న ఎంతో ఉత్సాహంగా కేరళ తీరాన్ని తాకి, ప్రారంభంలో ఉధృతంగా కదిలిన నైరుతి రుతుపవనాలు.. ఆ తర్వాత దేశవ్యాప్తంగా తన వేగాన్ని తగ్గించుకున్నాయి. దక్షిణ, ఈశాన్య భారత ప్రాంతాల్లో వేగంగా విస్తరించినప్పటికీ, ఆ తర్వాత ఏర్పడిన వాతావరణ పరిస్థితుల వల్ల వీటి పురోగతి మందగించింది. ప్రస్తుతం దేశంలోని మధ్య, పశ్చిమ, వాయువ్య ప్రాంతాలు వర్షాల కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నాయి.

# ఫ్యూచర్ సిటీని వందశాతం రద్దు చేస్తాం

## అక్కడి భూములు ఫార్మా కోసం సేకరించాం



- వాటిని మార్పు చేస్తే చట్టం ఒప్పుకోదు
- జర్నలిస్టులకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలి
- మీనాక్షనటరాజన్‌కు తెలంగాణ కాంగ్రెస్ వెన్నుపోటు
- వందకోట్ల ప్రజాధనంతో సిఎం సొంతిల్లు నిర్మాణం
- మాజీమంత్రి హరీష్ రావు ఘాటు విమర్శలు

హైదరాబాద్ జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఫ్యూచర్ సిటీని వందకు వంద శాతం బీఆర్ఎస్ రద్దు చేస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాకం వల్ల రూ.70వేల కోట్ల ఫార్మా పెట్టుబడులు పోయాయన్నారు. ఫార్మా సిటీ రద్దు చేసి భూములు వెనక్కి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భూములు ఫార్మాకు కాకుండా మార్పులు

-మిగతా 2 లో



# టీఆర్ఎస్ ఎవరిది?

- ఆ పేరు కవితకు దక్కేనా...
- నాదేనంటున్న షోలాపూర్‌కు చెందిన దయానంద్
- తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన పేరుతో దరఖాస్తు
- ఎవరికీ కేటాయించొద్దంటున్న బీఆర్ఎస్
- ఈసీఐకి 700 వరకు అభ్యంతరాలు

హైదరాబాద్ జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): టీఆర్ఎస్ అనే పేరుతో తెలంగాణ ప్రజలకు విడదీయరాని అనుబంధం ఉన్నది. అయితే దేశవ్యాప్తంగా టీఆర్ఎస్ అనే పేరు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. టీఆర్ఎస్ అనే పేరుకు సంబంధించిన వివాదం ముదురుతున్నది. ఆ పేరు తమదంటే తమదంటూ ప్రకటనలు ఇస్తున్నారు. ఆధారాలతో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా కలుస్తున్నారు. దీంతో టీఆర్ఎస్ అనే పేరు ఎవరిది?, ఎవరికి దక్కుతుందనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది. కల్వకుంట్ల కవిత ఈ ఏడాది ఏప్రిల్ 25న తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో పార్టీని ప్రకటించారు.

-మిగతా 2 లో



# భారతీయులున్న నౌకలపై దాడులు..

- నాలుగు రోజుల్లో 3 నౌకలపై అమెరికా దాడి
- ముగ్గురు భారత నావికుల మృతి
- తీవ్రంగా ఖండించిన భారత్
- వెంటనే దాడులు ఆపాలని స్పష్టీకరణ

న్యూఢిల్లీ,
హెర్మూజ్ జలసంధి వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. అమెరికా, ఇరాన్ పరస్పరం భీకర దాడులకు పాల్పడుతున్నాయి. ఈ క్రమంలో భారతీయులున్న వాణిజ్య నౌకలపై అమెరికా దాడులు చేయడం సంచలనంగా మారింది. కేవలం నాలుగు రోజుల్లో మూడు నౌకలపై అమెరికా బలగాలు దాడులు చేశాయి. ఓ ఘటనలో ముగ్గురు భారత నావికులు ప్రాణాలు కోల్పోయారు. తమ నిబంధనలు పాటించట్లేదంటూ కారణం చెప్పి యూఎస్ మిలిటరీ దాడులు నిర్వహించడాన్ని ప్రపంచ దేశాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ దాడులపై విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. ఈ దాడులకు గురైన నౌకలన్నీ విదేశాలకు చెందినవే అని.. మొదట దాడి జరిగిన రెండు నౌకలు పలావు దేశానికి చెందినవి కాగా..

-మిగతా 2 లో

# దద్దరిల్లిన పశ్చిమాసియా..

మొదటి తరువాయి

ఇరాన్ నిఘా వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, వాయు రక్షణ వ్యవస్థ స్థావరాలు లక్ష్యంగా అమెరికా గురువారం దాడులు కొనసాగించింది.
అమెరికా దాడులకు దీటుగా స్పందించిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కువైట్, బహ్రెయిన్‌లోని వాయు స్థావరాలు, అమెరికా నావికా దళం ఐదవ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం సహా 18 అమెరికా సైనిక స్థావరాలపై దాడులు చేసింది. అలాగే జోర్డాన్‌లోని అమెరికా వాయు స్థావరం అల్-అజ్రక్‌పై కూడా క్షిపణి దాడి చేసినట్టు ప్రకటించింది. హొర్ముజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్టు ప్రకటించింది.

ఖర్గ్‌ను స్వాధీనం చేసుకుంటాం..: ట్రంప్

ఇరాన్‌పై ఈ రాత్రి భారీ దాడిచేయనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. ఆ దేశంలోని ఖర్గ్ ద్వీపంతో పాటు చమురు, గ్యాస్ పరిశ్రమలపై పూర్తి నియంత్రణ సాధిస్తామన్నారు. ఇరాన్ మిలిటరీ సామర్థ్యాలను ఇప్పటికే తీవ్రంగా బలహీన పరిచామని ఆయన చెప్పారు. 'అమెరికా ఈ రోజు రాత్రి ఇరాన్‌పై అత్యంత తీవ్రమైన దాడి చేయబోతున్నది. ఇరాన్ నావిక, వాయు, రాడార్, యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్, ఇతర రక్షణ వ్యవస్థలు ఇప్పటికే తుడిచిపెట్టుకు పోయాయి.' అని ఆయన పేర్కొన్నారు.

# పీవోకే మళ్లీ రక్తసిక్తం..

మొదటి తరువాయి

గోధుమ పిండి, బియ్యం, విద్యుత్తు ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వేల సంఖ్యలో వచ్చిన ప్రజలు శాంతియుతంగా ఆందోళన చేస్తుండగా ఒక్కసారి కలకలం రేగింది.సుమారు 60 వేల నుంచి 70 వేల మంది వరకు తరలివచ్చిన ఆందోళనకారులపై పాక్ సైన్యం, రేంజర్లు ఒక్కసారిగా కాల్పులకు దిగారని స్థానికులు తెలిపారు. ఈ కాల్పుల్లో 16 మంది మృత్యువాత పడగా, 37 మంది వరకు గాయపడ్డారని పేర్కొన్నారు. గత శుక్రవారం నుంచి పీవోకేలో జరుగుతున్న అల్లర్లు, వాటిని అణచివేసే పేరిట జరిగిన సైనిక చర్యలో 53 మంది సాధారణ పౌరులు మరణించారని అధికారులు తెలిపారు. రావలకోట్‌లో జరిగిన తాజా కాల్పులతో గురువారం పీవోకే అంతటా ఆందోళన నెలకొంది. ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

# గృహిణులు దేశ నిర్మాతలు..

మొదటి తరువాయి

గృహిణులను దేశ నిర్మాతలుగా అభివర్ణించింది. వారు ఇంటి పని చేస్తూ, పిల్లల్ని, కుటుంబ సభ్యుల్ని చూసుకుంటారని, వారి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని, అంతిమంగా దేశాభివృద్ధికి దోహదపడతారని కోర్టు అభిప్రాయపడింది. వారు ఇంట్లో చేసే పనులతో ఆదాయం సంపాదించకపోయినంతమాత్రాన వారి పనితనానికి వెల కట్టలేమని కాదని, సగటున కనీసం రూ.30,000 చెల్లించాలని ఆదేశించింది. సాధారణంగా గృహిణులు చేసే పనులకు పరిహారం తక్కువగా వస్తుంటుంది. ఎందుకంటే ఈ పనిని ఇటు కూలీ పనిలాగా కాకుండా, అటు స్కిల్డ్, నాన్ స్కిల్డ్ పనిలాగా కాకుండా చూస్తారు. అందుకే పరిహారం విషయంలో గృహిణులకు తగిన న్యాయం జరగడం లేదు. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలకు అనుగుణంగా ఇకపై గృహిణులు మరణిస్తే వారి కుటుంబాలకు ప్రతి నెలా కనీస పరిహారం అందే అవకాశం ఉంది. 2001లో పంజాబ్‌లో ఒక మహిళ రోడ్డు ప్రమాదంలో మరణించింది. ఆమె తరఫున పరిహారం కోరుతూ భర్త, ముగ్గురు పిల్లలు మోటార్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. అనంతరం ఈ అంశం వివిధ కోర్టుల్లో విచారణ జరుగుతూ.. చివరికి సుప్రీంకోర్టు వరకు చేరింది. తాజాగా కోర్టు వారికి అనుకూలంగా, పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

# తొలి వానకే చేతులెత్తేసిన సర్కార్

మొదటి తరువాయి

ప్రజలు గంటల తరబడి ట్రాఫిక్‌లో నరకం చూస్తున్నా కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వర్షాకాలం కంటే ముందే ఎస్ఎన్డీపీ, ఎస్ఆర్డీపీ పథకాల ద్వారా నాలాల పూడికతీత, వ్యర్థాల తొలగింపు పనులను పక్కాగా సమీక్షించేవాళ్లమని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పద్ధతులను పూర్తిగా గాలికొదిలేయడం వల్లే చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయమయ్యాయని ఆరోపించారు. తెలంగాణ ఆర్థిక ఇంజన్ అయిన హైదరాబాద్ ప్రగతిని రేవంత్ సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, పరిపాలనను వదిలేసి కేవలం రాజకీయాల పైనే దృష్టి పెడుతోందని ఆరోపించారు. వర్షం పడగానే గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, విద్యుదాఘాతాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. ప్రభుత్వానికి ముందస్తు సన్నద్ధత ఎక్కడ ఉందని నిలదీశారు. పాలనను పక్కనబెట్టి ప్రతిపక్షాలపై కక్షసాధింపులకు ప్రాధాన్యమిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, త్వరలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని కేటీఆర్ హెచ్చరించారు. ఈ తొలి వాన రాజకీయం ఇప్పుడు తెలంగాణలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ మధ్య లొల్లిని మరింత ముదిరేలా చేసింది.

# నైరుతి మందగమనం..



**న్యూఢిల్లీ,**
ఈనెల 4న నైరుతి రుతు పవనాలు కేరళ తీరాన్ని తాకిన తర్వాత.. వాటి ఉధృతి దేశవ్యాప్తంగా మారింది. రుతు పవనాల రాక ఈసారి చాలా బలంగా ఉన్నప్పటికీ.. దేశవ్యాప్తంగా వాటి పురోగతి అనుకున్నంతగా లేదు. దక్షిణ, ఈశాన్య భారతదేశంలోని చాలా ప్రాంతాలపై వేగంగా దూసుకెళ్లిన రుతు పవనాలు.. అటు తర్వాత క్రమంగా నెమ్మదించాయి. ప్రారంభ వేగం తర్వాత దేశవ్యాప్తంగా రుతు పవనాల కదలికలు మందగించాయి. దేశంలోని మధ్య, పశ్చిమ, వాయవ్య ప్రాంతాలు ఇప్పటికీ 'నైరుతి' వర్షాల కోసం ఎదురుచూస్తున్నాయి.అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో అల్పపీడన వ్యవస్థలు, వాయుగుండాలు, తుఫానులు చాలాకాలంగా ఏర్పడకపోవటం ప్రధాన కారణమని ప్రైవేట్ ఏజెన్సీ 'స్కైమెట్' తెలిపింది. దీని ఫలితంగా ప్రస్తుతం నైరుతి రుతు పవనాల పురోగతి నెమ్మదిగా, అసమానంగా ఉందని 'స్కైమెట్' అంచనా వేసింది. అరేబియా, బంగాళాఖాతంలో వాతావరణ వ్యవస్థలు నైరుతి రుతు పవనాల పురోగతికి ముఖ్యమైన చోదకాలుగా పనిచేస్తాయి. భారత భూభాగమంతటా రుతుపవనాల కదలికలను వేగవంతం చేయగలవు.

# రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

**-ప్రధానమంత్రితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ.. రాష్ట్ర ప్రాజెక్టులపై చర్చలు**
**-7 కారిడార్లలో రూ. 38,595 కోట్లతో మెట్రో విస్తరణ ప్రతిపాదనలు**
**-ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల నిర్మాణానికి ఒకేసారి అనుమతులు**
**-హైదరాబాద్-అమరావతి-బందరు పోర్టు 12 లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేకు విజ్ఞప్తి**
**-గోదావరి జలాల వినియోగంపై మహారాష్ట్రతో చర్చలకు కేంద్రం సహకరించాలి**
**-వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనుల ప్రారంభంపై ప్రధానితో సీఎం ముఖ్య చర్చ**
**-ఐఐఎం ఏర్పాటుకు 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్రం సిద్ధం**



న్యూఢిల్లీ
తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని వివరించారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని కూడా ప్రధానికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఫేజ్-2లో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు 38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్ఏఐకి 626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ అవార్డు పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్ఎండీఏ మాస్టర్ ఎ÷-లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.
ల్గ÷దరాబాద్?అమరావతి?బందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. 120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తిచేసి ఎయిర్ పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ది చేకూరుతుందని అన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయని, ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం-2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుందని ప్రస్తావించారు.

# అద్దె భవనాలకు ఇక స్వస్తి

మొదటి తరువాయి

శిథిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు. ప్రభుత్వ కార్యాలయాలు అ÷-దదె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. మొదటి దశలో అద్దె భావనాలల్లో, శిథిలావస్థలో ఉన్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడానికి నివేదికలు అందించాలని రెవెన్యూ సెక్రటరీని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి నిర్మాణ పనులు వీలైనత త్వరితగతిన ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని చెప్పారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతోపాటు చాలా వరకు అ÷-దదె భవనాలలోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో అత్యాధునిక వసతులతో ఇప్పటికే సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు.ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్-మల్కాజిగిరి, పఠాన్ చెరువు, కోహెడ లలో భవనాలకు శంకుస్థాపన చేసుకొని పనులు కూడా ప్రారంభించుకున్నామని తెలిపారు. జిల్లా నియోజక వర్గ కేంద్రాలల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సంఖ్యకు అనుగుణంగా భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండు డిఐజి, నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నాలుగు వేల చదరపు అడుగుల నుంచి పది వేల చదరపు అడుగులు ఉండేలా ఒకే నమూనాలో నిర్మించాబోతున్నామని తెలిపారు.

# ఫ్యూచర్ సిటీని వందశాతం రద్దు చేస్తాం

మొదటి తరువాయి

చేస్తే చట్టం అంగీకరించదన్నారు. ఫార్మాసిటీ కోసం తాను కూడా 17 ఎకరాల భూమి ఇచ్చాను. ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వాడితే ఊరుకుంటామా అని అన్నారు. ఇప్పటికే పలువురు రైతులు ఈ భూములపై కేసులు వేశారు. జర్నలిస్టులపై ప్రేమ ఉంటే వివాదాలు లేని భూములు ఇవ్వొచ్చు కదా అన్నారు. . ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా మేం వ్యతిరేకించం. పాత భూములనే వారికి ఎందుకు ఇవ్వరని హరీశ్‌రావు ప్రశ్నించారు. జర్నలిస్టులకు వెంటనే ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిగా దాఖలు చేసిన పిటిషన్ తిరస్కరించడం వెనుక రాష్ట్రంలోని ఆ పార్టీ నేత హస్తం ఉందని హరీశ్ రావు ఆరోపించారు. ఆమెకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందన్నారు. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఉన్నట్లు తెలంగాణ నుంచే తమకు సమచారం అందిందని మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రే చెప్పారని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ కేసును బీజేపీ మంత్రికి లీక్ చేసింది ఎవరని.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మీనాక్షి నటరాజన్ కేసును లీక్ చేసింది ఎవరనే దానిపై ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్), జ్యుడీషియరీ ఎంక్వైరీ వేస్తావా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి చెప్పిన వ్యక్తికి వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వలేదని విమర్శించారు. అందుకే ఆ వ్యక్తి మధ్యప్రదేశ్ మంత్రికి సమాచారం ఇచ్చారని తెలిపారు. దీని వెనుక సీఎం రేవంత్ రెడ్డి అనుచరుడు ఉన్నారని చెప్పారు. రూ. 100 కోట్లతో తన నివాసం సమీపంలో బోధి పెవిలియన్ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి నివాసం నిర్మిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. ఈ ఇంటి నిర్మాణం కోసం పదుల సార్లు సీఎం అక్కడికి వెళ్లారని చెప్పారు. ఇనుప కంచెలకి రూ.17 కోట్లు.. రక్షణ కోసం, ఫుట్ బాల్ ఆడేందుకు రూ.10 కోట్లు కేటాయించారన్నారు. అలాగే కౌన్సిల్‌లో సీఎం ఛాంబర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. పని చేయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇన్ని క్యాంపు కార్యాలయాలు ఎందుకని హరీశ్ రావు ప్రశ్నించారు. ప్రజాధనం వృధా చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 7 కోట్లతో జీవో ఇచ్చి ఇప్పటికే రూ.70 కోట్ల పైన ఖర్చు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నగదు లేదు కానీ సీఎం సోకులకు రూ. వందల కోట్లు ఖర్చు పెడతారా? అంటూ హరీశ్ రావు అసహనం వ్యక్తం చేశారు.

# భారతీయులున్న నౌకలపై దాడులు..

మొదటి తరువాయి

గురువారం దాడికి గురైనది గినియా బిసావు దేశానికి చెందినదని వెల్లడించారు. దాడులకు గురైన వాటిల్లో ఇండియాకు చెందినవి లేవన్నారు. ఈ విషయంపై యూఎస్ డిచార్జర్‌ను పిలిపించి సమన్లు జారీ చేశామని.. వెంటనే దాడులను ఆపాలని చెప్పామని అన్నారు.

ముగ్గురు మృతి..

జూన్ 11న ఒమన్‌లో గినియా బిసావు దేశానికి చెందిన ట్యాంకర్ మీద అమెరికా బలగాలు దాడులు చేయగా.. ముగ్గురు భారత నావికులు మృతి చెందారు. ఈ నౌకలో 24 మంది భారతీయులు ఉండగా.. అధికారులు 21 మందిని రక్షించగా.. ముగ్గురు మాత్రం ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్ నుంచి చమురు తీసుకువస్తుండగా ఈ ట్యాంకర్ మీద యూఎస్ దాడులు జరిపింది. ఈ ట్యాంకర్ మీద ఆంక్షలు ఉన్నాయని.. రష్యా, ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో తమ సూచనలు పాటించకుడా వెళ్లడంతో దాడులు చేసినట్టు యూఎస్ మిలిటరీ వెల్లడించింది.

ఇండియా తీవ్ర ఆగ్రహం..

గురువారం జరిగిన దాడిపై ఇండియా తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. న్యూఢిల్లీలోని అమెరికా డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్‌ను విదేశాంగ శాఖ పిలిపించి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దాడికి గల కారణాలపై వివరణ కోరింది. భారత నావికులపై జరుగుతున్న దాడులను ఉపేక్షించబోమని తెలిపింది.

నావికులను చంపినందుకు థ్యాంక్స్ చెప్పారా?

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ప్రధాని మోదీ థాంక్స్ చెప్పడంపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'ట్రంప్‌నకు ప్రధాని థ్యాంక్స్ చెప్పడం వెనక ఉద్దేశం ఏంటి? భారత నావికులను యూఎస్ బలగాలు దాడులు చేసి చంపుతున్నందుకా? భారత పరిస్థితి దయనీయంగా మారినందుకా? మన దేశ పరిస్థితి అత్యంత అవమానకరంగా మారిపోయింది. దేశానికి బలమైన నాయకత్వం అవసరం. దేశ సార్వభౌమత్వాన్ని ఇతర దేశాలు ప్రభావితం చేస్తున్నాయి. ఇది దేశానికి మంచిది కాదు' అని ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. మోదీ పాలన 12 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ట్రంప్ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. అందుకు మోదీ థ్యాంక్స్ చెప్పారు

# టీఆర్ఎస్ ఎవరిది?

మొదటి తరువాయి

ఆ తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) తెలంగాణ రక్ష?ణ సేన (టీఆర్ఎస్) పేరును ఇచ్చింది. అయినప్పటికీ టీఆర్ఎస్ పేరు ఉండడంతో కవితతోపాటు ఆ పార్టీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది. అయితే టీఆర్ఎస్ అనే పేరుపై అభ్యంతరాలు ఉంటే చెప్పాలంటూ గతనెల ఒకటిన కవిత పలు పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. దీనిపై భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) లీగల్ సెల్ ఈసీఐకి ఫిర్యాదు చేసింది. టీఆర్ఎస్ అనే పేరు తెలంగాణ సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్నదని తెలిపింది. ఆ పేరుతో ప్రజల భావోద్వేగాలతోపాటు అనుబంధం ఉందని పేర్కొంది. ఇప్పటికీ తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గానే ప్రజలు గుర్తిస్తారని వివరించింది. అందువల్ల టీఆర్ఎస్ పేరును ఎవరికీ కేటాయించొద్దని ఈసీఐకి విజ్ఞప్తి చేసింది. కవిత స్థాపించిన టీఆర్ఎస్ పేరుపై దాదాపు 700 వరకు అభ్యంతరాలు ఈసీఐకి అందాయి.

తెలంగాణలోనూ టీఆర్ఎస్ పేరుతో రెండు పార్టీలు

కల్వకుంట్ల కవిత టీఆర్ఎస్ పార్టీని ప్రకటించడానికి ముందే తెలంగాణలో ఆ పేరుతో మరో రెండు పార్టీలు రిజిస్టర్ అయ్యాయి. రాష్ట్రంలో 14 రాజకీయ పార్టీలు గుర్తింపు పొందాయి. అందులో తెలంగాణ రక్ష?ణ సమితి (డెమొక్రటిక్), తెలంగాణ రాజ్య సమితి పేరుతో రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన పార్టీల జాబితాలో ఉన్నాయి. ఈ పార్టీలు కూడా టీఆర్ఎస్ పేరును కవితకు కేటాయించొద్దని ఈసీఐని కోరాయి. టీఆర్ఎస్ పేరుపై కేంద్ర ఎన్నికల సంఘానికి అభ్యంతరాలు అందడంతో ఏం చేయాలనే దానిపై అధికారులు సమాలోచన చేస్తున్నారు. కవిత పార్టీ ప్రకటించడానికి ముందే టీఆర్ఎస్ పేరును ఇతర పార్టీలు వాడుకోవాలని దరఖాస్తు చేయడం, గతంలో వాడిన బీఆర్ఎస్ కూడా అభ్యంతరం చెప్పడం వల్ల ఇప్పుడు ఆ పేరు ఎవరికి దక్కుతుందన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది. అయితే కవితకు టీఆర్ఎస్ పేరు దక్కేది కష్టమేనని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

## నూతన కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేత ప్రారంభం కానున్న కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు.భవన నిర్మాణంలో మిగిలిపోయిన పనులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేయించారని ఆయన తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, జాతీయ జెండా ఆవిష్కరణ జరగనున్నాయి.నూతన కలెక్టరేట్‌లో గ్రీనరీ ల్యాండ్‌స్కేప్, విస్తరించిన రహదారులు, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పరిపాలన సౌకర్యాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పెన్షన్లు వంటి సంక్షేమ కార్యక్రమాలు ఇక్కడి నుంచే అమలు చేయనున్నట్లు తెలిపారు.జిల్లా అభివృద్ధి కోసం విద్య, వైద్య రంగాల్లో కొత్త అవకాశాలు కల్పిస్తున్నామని, శాతవాహన యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ, మానేరు రివర్ ఫ్రంట్ రెండో దశ పనులు కొనసాగుతున్నాయని వివరించారు.కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవనం ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి చేత ప్రారంభం కానుంది.

## వంద శాతం ధాన్యం కొనుగోలు పూర్తి

**- మార్కెట్ చైర్మన్ తిరుపతి**



**పెద్దపల్లి, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

: పెద్దపల్లి జిల్లాలో పాలకుర్తి మండలంలోని 17 కొనుగోలు కేంద్రాల్లో వంద శాతం ధాన్యం కొనుగోలు పూర్తి చేసి రికార్డు సృష్టించినట్లు రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపల్లి తిరుపతి తెలిపారు.సొసైటీల ద్వారా 11, ఐకేపీ కేంద్రాలు 4, హకా ద్వారా 2 కేంద్రాల్లో కొనుగోలు పూర్తయిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ ప్రత్యేక శ్రద్ధతో ప్రతి గింజ రైతుల వద్ద నుండి కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసినట్లు చెప్పారు. రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పాలకుర్తి మండలంలో వంద శాతం ధాన్యం కొనుగోలు పూర్తి చేసి రికార్డు సృష్టించారు.

## పాల డైరీ నూతన అధ్యక్షుడిగా నూనె భగవాన్ రెడ్డి ఎన్నిక



**గన్నేరువరం, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ పాల డైరీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నూనె భగవాన్ రెడ్డిని గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మాధరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ కళ్లెం అనిత ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. పాల కేంద్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సర్పంచ్ శ్రీనివాస్ ఆకాంక్షించారు. గత ఆరు సంవత్సరాలు పాల కేంద్రం అధ్యక్షుడిగా సేవలందించిన బండి తిరుపతి కృషిని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పాలకేంద్రం డైరెక్టర్లు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉచిత మజ్జిగ పంపిణీ




**ఇల్లంతకుంట, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఎండ తీవ్రత నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు బిటీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి గురువారం 500 లీటర్ల చల్లని మజ్జిగను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు బెంద్రం తిరుపతి రెడ్డి తెలిపారు.గత 16 సంవత్సరాలుగా వేసవి కాలంలో 100 రోజుల పాటు చలివేంద్రం ఏర్పాటు చేసి మినరల్ వాటర్, మజ్జిగతో ప్రజల దప్పిక తీర్చుతున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ సేవా కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు గుగ్గిల్ల ఆంజనేయులు, గొడుగు రాకేశ్, బాంగోని శ్రీనివాస్, ప్రయాణికులు పాల్గొన్నారు.ప్రజల దాహార్తి తీర్చేందుకు బిటీఆర్ ఫౌండేషన్ ప్రతి గురువారం 500 లీటర్ల మజ్జిగ పంపిణీ చేస్తోంది.

## ప్రకృతి వ్యవసాయంపై రైతుల సమ్మేళనం



**జమ్మికుంట, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రసాయన ఎరువులు వాడటం వల్ల పంటలతో పాటు రోగాలు కూడా వస్తున్నాయని, ఇకనైనా రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు.జమ్మికుంట క్రుషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ప్రకృతి వ్యవసాయంపై రైతుల సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, సేంద్రీయ సాగు చేసిన రైతులు కోటీశ్వరులు కావచ్చని, రాబోయే రెండేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 25 వేల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.మోదీ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, పరంపరాగత్ కృషి వికాస్ యోజన, పీఎం ప్రాణం వంటి పథకాలను ప్రవేశపెట్టిందని, ఇప్పటికే లక్షలాది రైతులు శిక్షణ పొందారని తెలిపారు. సేంద్రీయ పంటలకు మద్దతు ధరతో పాటు ఎకరానికి రూ.4 వేల చొప్పున ప్రోత్సాహకాలు అందిస్తున్నామని వివరించారు.రసాయన ఎరువులను విడనాడి ప్రకృతి వ్యవసాయాన్ని స్వీకరించాలని రైతులకు కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు.

## ఓపెన్ జిమ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 49వ డివిజన్ కురుమవాడ ప్రభుత్వ పాఠశాల సమీపంలో మలయప్ప ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, యువతలో ఫిట్‌నెస్ అవగాహన పెంపొందించేందుకు ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిట్ ఇండియా పిలుపుకు అనుగుణంగా ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.ప్రజలు, ముఖ్యంగా యువత వ్యాయామం, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ప్రతి డివిజన్‌లో మౌలిక వసతులతో పాటు ఆరోగ్య, క్రీడా సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. కురుమవాడలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ పిలుపునిచ్చారు

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలని డబ్ల్యూజేఎఫ్ డిమాండ్





**అమ్రాబాద్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జర్నలిస్టుల కుటుంబాల సంక్షేమం కోసం పిల్లలకు విద్యా సంస్థల్లో 50% ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వద్ద నిరసన వినతి కార్యక్రమం జరిగింది.జిల్లా డీఈవో, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన జర్నలిస్టులు, తక్కువ జీతాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల పిల్లలను మంచి విద్యాసంస్థల్లో చదివించడం కష్టమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాయితీ వల్ల వేలాది జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక ఊరట లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఈ రాయితీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వినతిని సానుకూలంగా పరిశీలించి నివేదిక పంపిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ ఇవ్వాలని డబ్ల్యూ జేఎఫ్ డిమాండ్ చేసింది.

## ప్రతి పాఠశాల ఒక ఉద్యానవనం కావాలి

**- డిఓ గూళ్ళ అంజన్ కుమార్**



**పెద్దపల్లి, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీ పోస్టర్‌ను పెద్దపల్లి బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు.జిల్లా పరీక్షల, విజ్ఞానశాస్త్ర పర్యవేక్షకులు వి. హనుమంతు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రకృతిపై ప్రేమ, బాధ్యతా భావం పెంపొందించుకోవాలని సూచించారు. మొక్కలు నాటి వాటిని వృక్షాలుగా మార్చే వరకు సంరక్షణ బాధ్యతను విద్యార్థులు స్వీకరించాలని పిలుపునిచ్చారు. జిల్లా కోఆర్డినేటర్ గూళ్ళ అంజన్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల ఒక పచ్చని ఉద్యానవనంగా మారడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థుల భాగస్వామ్యంతో ప్రతి పాఠశాల పచ్చని ఉద్యానవనంగా మారాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు



**పెద్దపల్లి, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఈ రబీ సీజన్‌లో పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 334 కేంద్రాల ద్వారా 4.29 లక్షల మెట్రిక్ టన్నుల వరి, 26 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేసింది.రైతుల ఖాతాల్లో రూ.1,018 కోట్లు నేరుగా జమ చేసినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసినా చివరి గింజ వరకు కొనుగోలు చేశామని స్పష్టం చేశారు.భవిష్యత్తులో రైతులు ఇబ్బంది పడకుండా 1.70 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాముల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు.పెద్దపల్లిలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.1,018 కోట్లు జమ చేసినట్లు ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు.

## శ్యామ్ కిషోర్‌ను పరామర్శించిన మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ

**నల్గొండ, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నల్గొండ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్యామ్ కిషోర్ ఇటీవల తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యారు. నిమ్స్ హాస్పిటల్‌లో శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణతో పాటు సంఘ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఉప్పు



సత్యనారాయణ మాట్లాడుతూ, అసోసియేషన్ అండగా ఉంటుందని, కలత చెందవద్దని, అధికారులతో మాట్లాడి అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్, నల్గొండ జిల్లా సూపరింటెండెంట్ కె. లత, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్లపూడి జైపాల్, గౌరవ సలహాదారు సూర్యాపేట సూపరింటెండెంట్ జి. సుధీర్, కార్పొరేషన్ సూపరింటెండెంట్ కే. గోవర్ధన్ రెడ్డి, హెల్త్ పై ఎండి చలపతిరావు, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షురాలిగా ఒడ్నాల జ్యోతి



**పాలకుర్తి, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండల ఉపసర్పంచుల ఫోరం నూతన కార్యవర్గం అధ్యక్షురాలిగా ఒడ్నాల జ్యోతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈశాల తక్కల్లపల్లి గ్రామ సమ్మక్క సారలమ్మ దేవస్థానంలో జరిగిన సమావేశంలో 16 గ్రామాల ఉపసర్పంచులు తీర్మానం చేసి ఆమెను అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ముత్యాల ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా అల్లం శివ, కార్యదర్శిగా బండి సాగర్, ప్రచార కార్యదర్శిగా దుర్శెట్టి నాగమణి, సంయుక్త కార్యదర్శిగా పొన్నం సంతోష్ గౌడ్, సహాయ కార్యదర్శులుగా ఇస్లావత్ రాజేశ్వరి, పోతురాజు సంతోష్, కార్యనిర్వహణ కార్యదర్శిగా బండ కుమార్, సభ్యులుగా బిసిపిల్లి వర్షిణి, జయరాం, చంద్ పాషా ఎన్నికయ్యారు. జ్యోతి మాట్లాడుతూ ఉపసర్పంచుల హక్కుల సాధన, సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా ఫోరం అధ్యక్షులు తలారి సాగర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్ గౌడ్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పాలకుర్తి ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షురాలిగా ఒడ్నాల జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# మురళీకృష్ణ ఆలయంలో ఘనంగా ఏకాదశి పారాయణం



**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పురుషోత్తమ మాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా కరీంనగర్ సాయిరాం నగర్‌లోని మురళీకృష్ణ ఆలయంలో విష్ణు సహస్రనామావళి, భగవద్గీత పారాయణం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు మాచర్ల వసంతం ఉదయలక్ష్మి, బొడ్ల కృష్ణ పుష్ప, అర్చకులు మంగళం రాజేందర్ ఆధ్వర్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మురళీకృష్ణ ఆలయంలో భక్తులు ఘనంగా పారాయణం చేశారు.

# పుట్ట మధుపై కాంగ్రెస్ ఆరోపణలను ఖండించిన బీఆర్ఎస్



**పాలకుర్తి, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుపై కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలను పాలకుర్తి బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. బసంతనగర్లో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీటీసీ అతిక్, బండారి కిరణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో నమ్మకం కోల్పోయి భయంతో నిరాధార ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని, రాజ్యాంగం పట్ల చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. పూదరి సత్యనారాయణ అరెస్టు విషయంలో కోర్టు వ్యాఖ్యలు వచ్చినా కాంగ్రెస్ నాయకులకు బుద్ధి రాలేదని ఎద్దేవ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పుట్ట మధుపై మరోసారి నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలే గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. పుట్ట మధుపై కాంగ్రెస్ ఆరోపణలు నిరాధారమని బీఆర్ఎస్ నేతలు ఖండించారు.

# ఉచిత సర్జికల్ క్యాంప్ నిర్వహణ




**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నేషనల్ సర్జన్స్ వీక్ సందర్భంగా వాసుదేవా హాస్పిటల్ ఆధ్వర్యంలో, అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ కాస్, అలయన్స్ క్లబ్ సంయుక్తంగా ఇమాల్ డిపోలో ఉచిత సర్జికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌లో 250 మంది కార్మికులు వైద్య సేవలు పొందగా, 10 మందిలో పైల్స్ సమస్యలు, ఇద్దరిలో థైరాయిడ్, బ్రెస్ట్ కంతులు గుర్తించారు. మొదటి 100 మందికి ఉచితంగా షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేశారు. కాస్ అధ్యక్షుడు డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ, గుర్తించబడిన థైరాయిడ్ రోగులకు ఉచిత శస్త్రచికిత్సలు చేస్తామని, కార్మికులకు ఒక నెల పాటు ఉచిత ఓపీ సేవలు, ల్యాబ్ పరీక్షలపై 50% రాయితీ అందిస్తామని తెలిపారు. నేషనల్ సర్జన్స్ వీక్ సందర్భంగా నిర్వహించిన ఉచిత క్యాంప్‌లో వందలాది కార్మికులు వైద్య సేవలు పొందారు.

# ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని ఎఐవైఎఫ్ డిమాండ్





**హుస్నాబాద్--కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) డిమాండ్ చేసింది. హుస్నాబాద్‌లో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతిపత్రం అందజేసిన ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ మాట్లాడుతూ, లక్షలాది మంది యువత ఉన్నత విద్య పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలకు బదులుగా శాశ్వత నియామకాలు చేపట్టాలని, టీజీపీఎస్సీ ద్వారా ప్రతి సంవత్సరం నియామక క్యాలెండర్ విడుదల చేయాలని కోరారు. కరీంనగర్‌లో తెలంగాణ చౌక్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పోలీస్ శాఖలో 12,000, వైద్య ఆరోగ్య శాఖలో 10,000కు పైగా, గ్రామపాలనలో 10,954, మహిళా శిశు సంక్షేమ శాఖలో 14,236 అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఇటీవల విడుదలైన కొన్ని నియామక నోటిఫికేషన్లు స్వాగతించదగినవే అయినప్పటికీ, రాష్ట్రంలోని మొత్తం ఖాళీలతో పోలిస్తే అవి చాలా స్వల్పమని ఆయన అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసి, యువతకు న్యాయం చేయాలని ఎఐవైఎఫ్ డిమాండ్ చేసింది.

# ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన జల కుమారి



**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: హుజూరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన నాయక్ వాడి జల కుమారి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హుజూరాబాద్ డివిజన్ పరిధిలో పరిపాలన, రెవెన్యూ శాఖ పనితీరు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. హుజూరాబాద్ ఆర్డీఓగా జల కుమారి బాధ్యతలు ప్రారంభించారు.

# సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్ అరెస్ట్



**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దనుక రాధిక (44)ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. కాంట్రాక్టర్ల బిల్లుల క్లియరెన్స్‌ను వేగవంతం చేయడానికి అధికారిక హోదాను దుర్వినియోగం చేస్తూ, బినామీ ఖాతాల ద్వారా అక్రమ కమిషన్లు వసూలు చేసినట్లు ఏసీబీ విచారణలో బయటపడింది. ఈ లావాదేవీల కోసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. అక్రమ కమిషన్ల వసూళ్ల ఆరోపణలపై ఏసీబీ అధికారులు సీనియర్ అసిస్టెంట్‌ను అరెస్ట్ చేశారు.

# విద్యాసంస్థపై దాడి చేసిన ఏడుగురిపై కేసు

**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వావిలాలపల్లి ప్రాంతంలోని సెయింట్ పాల్స్ పాఠశాలలో కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి కార్యకలాపాలకు అంతరాయం కలిగించడంతో పాటు ఆస్తులను ధ్వంసం చేసిన ఘటనపై కరీంనగర్-III టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మల్ల్యాల రాకేష్, పూసల విష్ణు, బమండ నందు, చిప్ప యోగేష్, జర ఆకాష్, గోసుకుల విఘ్నేష్, శ్రీపతి వంశీ తదితరులను గుర్తించారు. విచారణలో పాఠశాల యాజమాన్యం పుస్తకాలను అనుమతి లేకుండా విక్రయిస్తోందని ఆరోపిస్తూ, నిందితులు నినాదాలు చేస్తూ కార్యకలాపాలను అడ్డుకోవడంతో పాటు బెంచీలు, బోర్డులు, స్లైడ్లు, బిల్‌బోర్డులు ధ్వంసం చేసినట్లు తేలింది. మొత్తం రూ.56 వేల విలువైన ఆస్తి నష్టం సంభవించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. విద్యాసంస్థలలో శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను సహించబోమని పోలీసులు హెచ్చరించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. విద్యాసంస్థలో అక్రమ ప్రవేశం, ఆస్తి ధ్వంసం చేసిన ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# కమిషనరేట్‌లో నూతన పరికరాలను ప్రారంభించిన సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో అధునాతన సాంకేతిక పరికరాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ప్రారంభించారు. టూ పోస్ట్ హైడ్రాలిక్ లిఫ్ట్, 3 హెచ్.పి కంప్రెషర్‌తో కూడిన టైర్ చేంజర్ టూల్‌ను పరిశీలించిన ఆయన, వాహనాల మరమ్మత్తులు సులభతరం అవుతాయని, సమయం ఆదా అవుతుందని తెలిపారు. పోలీస్ వాహనాలు ఎల్లప్పుడూ కండిషన్‌లో ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రతాప్, ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, రిజర్వు ఇన్స్పెక్టర్లు మేడ కిరణ్ కుమార్, రజినీకాంత్, శ్రీధర్ రెడ్డి, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగ అధికారులు, మెకానిక్‌లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్ వాహనాల నిర్వహణకు కొత్త పరికరాలు ఉపయోగపడతాయని కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు.

# కాలువ పూడికతీత పనులు ప్రారంభం



**కరీంనగర్ రూరల్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వర్షాకాలంలో కాలువ పూడిక నిండి పొలాలు మునుగుతున్నాయని రైతులు విజ్ఞప్తి చేయడంతో మున్సిపల్ మేయర్ కొలగాని శ్రీనివాస్ తక్షణమే స్పందించి జెసిబి పంపాలని అధికారులకు ఆదేశించారు. నిన్న ఓపెన్ జిమ్ ప్రారంభానికి బొమ్మకల్ వచ్చిన సమయంలో కార్పొరేటర్ మేకల వెంకటేష్, రైతులు సమస్యను వివరించగా వెంటనే చర్యలు తీసుకున్నారు. ఈరోజు పూడికతీత పనులను కార్పొరేటర్ మేకల వెంకటేష్ ప్రారంభించారు. తక్షణ స్పందనకు రైతులు, కార్పొరేటర్ మేయర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు భాగోతం మల్లయ్య, కాంరెడ్డి శశి, పోగుల సాయి చంద్ పాల్గొన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు బొమ్మకల్‌లో కాలువ పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి.

# అక్రమ షెడ్లను తొలగించాలని బీజేపీ డిమాండ్



**జగిత్యాల, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జగిత్యాల పట్టణంలో విచ్చలవిడిగా నిర్మించిన అక్రమ షెడ్లను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసింది భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ. పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ మాట్లాడుతూ కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండ్ వరకు, అలాగే గొల్లపల్లి రోడ్డువరకు ప్రధాన రహదారుల ఇరువైపులా వ్యాపారస్తులు కేటాయించిన స్థలాలను దాటి ఆక్రమణలు జరిపి వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, దీనివల్ల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల అవకాశాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ సిబ్బంది ఇటీవల యావర్ రోడ్డులో కొన్ని దుకాణాలను మాత్రమే కూల్చివేసి మిగతా ఆక్రమణలను వదిలేయడం పక్షపాతంగా ఉందని విమర్శించారు. అన్ని అక్రమ నిర్మాణాలను సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా తొలగించాలని డిమాండ్ చేశారు. అక్రమ షెడ్లను తొలగించకపోతే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీజేపీ నేతలు హెచ్చరించారు.

# యోగా - ఆరోగ్యకర జీవితానికి మహావరం


ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళన, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో యోగా శారీరక--మానసిక ఆరోగ్యానికి అద్భుతమైన సాధనంగా నిలుస్తోంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన యోగా భారతదేశానికి చెందిన అమూల్యమైన సంపద. నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకొని ఆరోగ్యకర జీవన విధానాన్ని అనుసరిస్తున్నారు. యోగా అంటే శరీరం, మనస్సు, ఆత్మల ఏకత్వం. మహర్షి పతంజలి రచించిన యోగసూత్రాలు యోగా శాస్త్రానికి మూలాధారం. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ధ్యానం వంటి అష్టాంగ యోగం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. యోగా సాధనతో శరీర కండరాలు బలపడతాయి, రక్తప్రసరణ మెరుగుపడుతుంది, ఊబకాయం, వెన్నునొప్పి, కీళ్ల సమస్యలు తగ్గుతాయి. ప్రాణాయామం ద్వారా ఊపిరితిత్తుల పనితీరు పెరుగుతుంది, రోగనిరోధక శక్తి బలపడుతుంది. మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, భావోద్వేగ నియంత్రణకు యోగా విశేషంగా ఉపయోగపడుతుంది. యువత ఎక్కువ సమయం సాంకేతిక పరికరాల ముందు గడపడం వల్ల శారీరక



శ్రమ తగ్గిపోతోంది. యోగా ద్వారా శరీర దారుఢ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. మహిళలకు హార్మోన్ల అసమతుల్యత, ఒత్తిడి, నిద్రలేమి సమస్యలను తగ్గించడంలో యోగా సహాయపడుతుంది. వృద్ధులకు శ్వాస వ్యాయామాలు, ధ్యానం ద్వారా ప్రశాంత జీవితం లభిస్తుంది. ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించడం యోగా ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేస్తోంది. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు యోగా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన పెంచుతున్నాయి. యోగా కేవలం వ్యాయామం కాదు, అది సంపూర్ణ జీవన విధానం. ఆరోగ్యవంతమైన శరీరం, ప్రశాంతమైన మనస్సు, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అందించే గొప్ప సాధనం. ప్రతి వ్యక్తి రోజూ కొంత సమయం యోగాకు కేటాయిస్తే ఆరోగ్య సమస్యలను దూరం చేసుకొని ఆనందమయమైన జీవితం గడపగలుగుతాడు. ఆరోగ్యకర భారత నిర్మాణానికి యోగా అత్యంత అవసరం. అందరూ యోగాను అలవాటు చేసుకొని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి.

**వ్యాసకర్త**

**గొట్టముక్కుల సమ్మి రెడ్డి**



# బస్ స్టేషన్ ఆధునీకరణ పనులకు శ్రీకారం



**హుస్నాబాద్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ ఆర్టీసీ బస్ స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణికుల సమస్యలను స్వయంగా తెలుసుకున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీఎస్ఆర్టీసీ ఎండి నాగిరెడ్డితో కలిసి ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. వర్షాకాలంలో బస్టాండ్ ప్రాంగణం జలమయమై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రధాన రహదారి డ్రైనేజీకి అనుసంధానంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. రోజుకు 35 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ ఏ కేటగిరి బస్ స్టేషన్‌ను ఒక పెద్ద షాపింగ్ మాల్‌ను తలపించేలా ఆధునీకరించి, అన్ని మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని మంత్రి తెలిపారు. స్థానిక షాపుల యజమానుల సహకారంతో సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ ఇత్తారి పద్మ, కౌన్సిలర్లు, ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. హుస్నాబాద్ బస్ స్టేషన్‌ను ఆధునిక సదుపాయాలతో రూపుదిద్దనున్నట్లు మంత్రి ప్రకటించారు.

## ఓటర్ల తొలగింపులు ప్రజాస్వామ్య విరుద్ధం

**-- ఎంపీ వంశీకృష్ణ**




**మంచిర్యాల, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మందమర్రి మండలంలోని గద్దెరాగడి ఎం.ఎన్.ఆర్. గార్డెన్స్‌లో జరిగిన ఓటర్ల ప్రత్యేక సవరణ జాబితా (ఎస్ఐఆర్) అవగాహన శిక్షణ కార్యక్రమంలో కార్మిక, మైనింగ్, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, ప్రతిపక్షాలను బలహీనపరిచే ఉద్దేశంతో బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ ముసుగులో ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించడాన్ని ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యగా విమర్శించారు. అలాగే నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీల వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం యువత ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని, 120 ఏటీసీ సెంటర్ల ద్వారా 25 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు టామ్‌కామ్ ద్వారా మరో 10 వేల మందికి జర్మనీలో ఉపాధి అవకాశాలు అందిస్తున్నామని వివరించారు. చెన్నూరు నియోజకవర్గంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మంత్రి వివేక్ వెంకటస్వామి విశేష కృషి చేస్తున్నారని ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. ఎస్ఐఆర్ ముసుగులో ఓటర్ల తొలగింపులు ప్రజాస్వామ్య విరుద్ధమని ఎంపీ వంశీకృష్ణ విమర్శించారు.

## బీసీల అభ్యున్నతికి పిడిశెట్టి రాజు సేవలు ప్రశంసనీయం



**హుస్నాబాద్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీసీల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజును తెలంగాణ రాష్ట్ర కుర్మ సంఘం అధ్యక్షుడు ముత్త సంపత్ ఘనంగా సన్మానించారు. కోహెడ మండలంలో తన స్వగృహానికి ఆహ్వానించి సన్మానం చేసిన సందర్భంగా ముత్త సంపత్ మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ఆయన సేవలను ప్రజలకు గుర్తు చేస్తున్నారని కొనియాడారు. అలాగే పెద్ద పండుగ బీరప్ప కళ్యాణం వేడుకలను విస్తృత స్థాయిలో ప్రచారం చేసి, బీరప్ప చరిత్రను ప్రజలకు చేరవేసి అవగాహన కల్పించారని తెలిపారు. బీసీల హక్కులు, సంక్షేమం కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తూ సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలో పిడిశెట్టి రాజు ముందుంటున్నారని, ప్రజాస్వామ్యంలో ప్రతి సామాన్యుడికి అవకాశం ఉండాలనే సందేశాన్ని ఎన్నికల పోటీల ద్వారా ప్రజల్లోకి తీసుకెళు _న్నారని ఆయన పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతికి పిడిశెట్టి రాజు చేస్తున్న కృషి అభినందనీయమని కుర్మ సంఘం అధ్యక్షుడు ముత్త సంపత్ ప్రశంసించారు.

## ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్




**హుస్నాబాద్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతే దేశానికి వెన్నెముక అని రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు పొగడ్తలు కురిపించినా, ఎన్నికల తర్వాత రైతుల సమస్యలను విస్మరిస్తున్నాయని తెలంగాణ ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ విమర్శించారు. విత్తనాల కొనుగోలు నుండి పంట అమ్మకం వరకు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కూలీల కొరత, ఎరువుల కొరత, వడగండ్ల వర్షాలు, తుఫాన్లు, విద్యుత్ కోతలు, వన్యప్రాణుల దాడులు, గిట్టుబాటు ధర లేకపోవడం వంటి సమస్యలు రైతు జీవితాన్ని కష్టసాధ్యంగా మార్చాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పనులు వ్యవసాయేతర రంగంలో జరుగుతుండటంతో రైతులకు కూలీల కొరత తీవ్రంగా ఉందని, కాబట్టి కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ముదిరాజ్ మహాసభ డిమాండ్ చేసింది.

## మేలకుంట శిఖం భూమి కాపాడాలని ఫార్వర్డ్ బ్లాక్ డిమాండ్




**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సీతారాంపూర్ శివారులోని మేలకుంట శిఖం ప్రభుత్వ భూమిని అక్రమ కబ్జాల నుండి రక్షించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ, సర్వే నెం. 71, 72లోని 13 ఎకరాల 26 గుంటల భూమిని తప్పుడు పత్రాలతో కబ్జా చేసి అపార్ట్మెంట్లు, విద్యాసంస్థలు, ఫంక్షన్ హాళ్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. 2023 డిసెంబర్ 22న సర్వేయర్ల బృందం చేసిన పరిశీలనలో 40 మందికి పైగా అక్రమ నిర్మాణాలు చేసినట్లు ప్రభుత్వ నివేదికలో స్పష్టమైందని తెలిపారు. అధికారులే అక్రమాలు నిరూపించినప్పటికీ, చెరువులు, నాలాలు కబ్జా చేస్తూ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, స్వల్ప వర్షానికే సూర్యనగర్ కాలనీ జలమయమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిర్మాణాలను నిలిపివేసి, అక్రమ కట్టడాలను కూల్చి ప్రభుత్వ భూమిని రక్షించాలని డిమాండ్ చేశారు. మేలకుంట శిఖం ప్రభుత్వ భూమిని కాపాడాలని ఫార్వర్డ్ బ్లాక్ నేతలు కోరారు.

## ఘనంగా ఇంటర్మీడియట్ బోటనీ నూతన పాఠ్యపుస్తక ఆవిష్కరణ



**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బోటనీ నూతన పాఠ్యపుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ ఆవిష్కరించారు. బోటనీ విభాగాధిపతి ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్, డా. పడాల తిరుపతి సంయుక్తంగా రచించిన ఈ పుస్తకం రాష్ట్రంలోని విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సులభమైన భాషలో, శాస్త్రీయ ప్రమాణాలతో రూపొందించబడింది. ప్రతి అధ్యాయాన్ని రంగురంగుల చిత్రాలు, రేఖాచిత్రాలు, పట్టికలతో సమగ్రంగా వివరించడం ప్రత్యేకత. అదనంగా క్యూ ఆర్ కోడ్‌ల ద్వారా వీడియో పాఠాలు, యానిమేషన్లు, నమూనా ప్రశ్నలు అందుబాటులో ఉంటాయి. ముఖ్య అతిథి డా. కె. సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ గ్రంథం ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షలతో పాటు నీట్, సి.యు.ఇ.టి., ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు కూడా ఎంతో ఉపయోగకరమని అన్నారు. ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు ఇలాంటి నాణ్యమైన విద్యా వనరులు రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల విద్యా నాణ్యత పెంపొందించడమే లక్ష్యంగా ఈ గ్రంథం రూపొందించబడిందని, రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు మేలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రచయితలు విద్యార్థుల్లో బోటనీపై ఆసక్తి పెంపొందించడం, పోటీ పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధం చేయడం లక్ష్యమని తెలిపారు. ఈ పాఠ్యపుస్తకం విద్యా రంగంలో కళాశాల సాధించిన మరో మైలురాయిగా నిలిచింది.

## హుస్నాబాద్--కొత్తపల్లి ఫోర్ లేన్ రోడ్డు పనుల పరిశీలన



**హుస్నాబాద్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ నుండి కొత్తపల్లి రాజీవ్ రహదారి వరకు నిర్మితమవుతున్న ఫోర్ లేన్ రోడ్డు విస్తరణ పనులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. విద్యుత్ స్తంభాల తొలగింపు, వాటి స్థానంలో టవర్ల నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కొండాపూర్ శివారులో నిర్మాణంలో ఉన్న కల్వర్టులను కూడా పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. హుస్నాబాద్--కొత్తపల్లి నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి ప్రభుత్వం ప్యాకేజీ--1, ప్యాకేజీ--2 కింద రూ.163.20 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఇందులో కొత్తపల్లి--సుందరగిరి 10 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు రూ.86 కోట్లు, సుందరగిరి--హుస్నాబాద్ రహదారికి రూ.77.20 కోట్లు కేటాయించారు. రోడ్డు పనులు పూర్తయితే హుస్నాబాద్--కరీంనగర్ మధ్య రవాణా సౌకర్యాలు మెరుగై ప్రజలకు ప్రయాణం సులభతరం అవుతుందని మంత్రి పేర్కొన్నారు.

# సుడా నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ రూరల్ మండలం ముగ్దుంపూర్, బహదూర్ఖాన్‌పేట్‌లో సుడా నిధులతో పలు అభివృద్ధి పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ముగ్దుంపూర్ మెయిన్ రోడ్డులో రూ.5 లక్షలతో డ్రెయిన్ నిర్మాణానికి, బహదూర్ఖాన్‌పేట్‌లో రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల కోరిక మేరకు అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని పనులు చేపడతామని నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం తిరుపతి రెడ్డి, ఉప సర్పంచ్ రమేష్, వార్డ్ మెంబర్ తప్పట్ల అంజయ్య, దుబ్బపల్లి సర్పంచ్ మోతే ప్రశాంత్ రెడ్డి, చామనపల్లి సర్పంచ్ బోగొండ అయిలయ్య, చర్లబుత్కూర్ సర్పంచ్ కూర నరేష్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు గుర్రం అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేందర్, వార్డ్ మెంబర్ మల్లారెడ్డి, శ్రీగిరి రంగారావు, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు. ముగ్దుంపూర్--బహదూర్ఖాన్‌పేట్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది.

# గీత మందిరంలో ఘనంగా పురుషోత్తమ యోగం పారాయణం



**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పురుషోత్తమ మాసం ఏకాదశి పుణ్యదినం సందర్భంగా కరీంనగర్ శ్రీ మలయాళ సద్గురు ఆశ్రమంలోని గీత మందిరంలో భక్తులు గీత అధ్యయనం నిర్వహించారు. గీత సమాజం సభ్యులు 15వ అధ్యాయం శ్రీ పురుషోత్తమ యోగం శ్లోకాలను 18 సార్లు పారాయణం చేశారు. అనంతరం శ్రీ విష్ణు సేవా నందగిరి స్వామి అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బండ సత్తయ్య, కార్యదర్శి ఉప్పల రామేశం, చౌక్కారపు సత్యనారాయణతో పాటు భక్తులు పాల్గొన్నారు. ఏకాదశి సందర్భంగా గీత మందిరంలో భక్తులచే గీత అధ్యయనం జరిగింది.

# గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు




**పెద్దపల్లి, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పదవ తరగతి పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ గోపా ప్రతిభా పురస్కారాలు అందజేయనుంది. అర్హులైన విద్యార్థులు తమ మార్కుల మెమోలు, వివరాలను జూన్ 13 మధ్యాహ్నం 12 గంటలలోపు మంద రమేష్ గౌడ్ 9849309888, కొక్కిస దేవేందర్ గౌడ్ 998919842లకు పంపాలని అసోసియేషన్ ప్రతినిధులు సూచించారు. గడువులోగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎంపిక చేసిన విద్యార్థులకు జూన్ 14న ఉదయం 10 గంటలకు గోదావరిఖనిలోని సాయిలీలా రెసిడెన్సీ ఫంక్షన్ హాల్‌లో పురస్కారాలు, షీల్డ్స్ ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గౌడ సంఘ నాయకులు, రాష్ట్ర--జిల్లా కమిటీ సభ్యులు, ప్రముఖులు పాల్గొననున్నారు. విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొందించడం, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గోపా ప్రతినిధులు తెలిపారు. జూన్ 13లోపు దరఖాస్తు చేసిన గౌడ విద్యార్థులకు జూన్ 14న ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు.

# జూన్ 13న జరుగనున ఎస్ఐఆర్ సమావేశం

**ఖానాపూర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖానాపూర్ అసెంబ్లీ పరిధిలో ఎస్ఐఆర్ సమావేశం జూన్ 13 శనివారం ఉదయం 8:30 గంటలకు కడం మండలంలోని కొండుకూరు ఫంక్షన్ హాల్‌లో జరగనుంది. ఈ సమావేశానికి బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు, బూత్ లెవల్ ఏజెంట్లు, మండల పదాధికారులు, సీనియర్ నాయకులు హాజరుకావాలని ఖానాపూర్ అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్ కోరారు. జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు కూడా పాల్గొననున్న ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జూన్ 13న ఖానాపూర్ అసెంబ్లీ ఎస్ఐఆర్ సమావేశం జరగనుంది.

# ఆసుపత్రిలో అరుదైన సిజేరియన్ విజయవంతం



**పెద్దపల్లి, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాల్వ శ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లి గ్రామానికి చెందిన 27 ఏళ్ల గర్భిణీ స్త్రీకి పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో అరుదైన సిజేరియన్ శస్త్రచికిత్స విజయవంతమైంది. ఆమెకు పూర్తి ప్లాసెంటా ప్రీవియా సమస్య ఉన్నట్లు అల్ట్రాసౌండ్, ఎంఆర్ఐ పరీక్షల్లో నిర్ధారణ కావడంతో వైద్యులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. నాలుగు యూనిట్ల రక్తాన్ని రిజర్వ్ చేసి, అత్యంత జాగ్రత్తగా సిజేరియన్ నిర్వహించారు. శస్త్రచికిత్స సమయంలో రక్తస్రావాన్ని సమర్థవంతంగా నియంత్రించి తల్లి, శిశువును క్షేమంగా ఉంచడంలో వైద్య బృందం విజయవంతమైంది. ప్రస్తుతం తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో గైనకాలజిస్టులు డాక్టర్ మంజుల, డాక్టర్ శ్రీదేవి, అనస్తీషియా వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కృష్ణవేణి పాల్గొన్నారు. వైద్య బృందాన్ని, ఓటీ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ అభినందించారు. ప్లాసెంటా ప్రీవియా వంటి ప్రమాదకర పరిస్థితిలో తల్లి--శిశువును కాపాడిన వైద్య బృందం సేవలు ప్రశంసనీయం.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆవు మృతి



**ఖానాపూర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖానాపూర్ మండలంలోని బాదం కుర్తి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన బాబర్ యజమానికి చెందిన ఆవు విలువ దాదాపు రూ.80 వేలుగా ఉందని ఆయన తెలిపారు. సంఘటన స్థలానికి గ్రామ సర్పంచ్ రోహిత్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రవణ్, విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్ సింగ్ చేరుకుని పరిశీలించారు. ఆవు మృతి కారణంగా పరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో ఇప్పటివరకు 10--12 పశువులు మృతి చెందినట్లు సమాచారం. ప్రతి శనివారం లైన్ల మరమ్మతులు చేస్తున్నప్పటికీ ఇలాంటి ఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇకనైనా ప్రతి గ్రామంలో విద్యుత్ లైన్లను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని వారు కోరుతున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆవు మృతి, గ్రామస్తులు పరిహారం కోరుతున్నారు.

# యోగా దినోత్సవాన్ని విజయవంతం చెయ్యాలి

– కలెక్టర్ రాజకుమారి



**నంద్యాల, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, యోగా అసోసియేషన్లు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జూన్ 7 నుండి 21 వరకు జిల్లావ్యాప్తంగా యోగా కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు, శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 17న నంద్యాల పట్టణంలో 5,000 మంది పాల్గొనే భారీ యోగా కార్యక్రమం, మహానంది దేవస్థానం ప్రాంగణంలో 1,500 మంది పాల్గొనే యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పాల్గొనే వారికి తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్, గ్రీన్ కార్పెట్ వంటి సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాధుల నివారణకు ఫాగింగ్, శుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. జూన్ 21న జరగనున్న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు.

# వరి కొయ్యలను కాల్చడం నేరం

-- సర్పంచ్ తిరుమల



**పాలకుర్తి, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులు పొలాల్లో వరి కొయ్యలను కాల్చడం నేరమని పాలకుర్తి గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల ఆజిమల్లు హెచ్చరించారు. గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో ఓ రైతు వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసిపడటాన్ని గమనించిన సర్పంచ్, స్థానికులతో కలిసి నీరు, పచ్చి కొమ్మల సహాయంతో మంటలను ఆర్పివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేల సారం తగ్గి పంట దిగుబడి తగ్గుతుందని, మోటార్లు, పైపులు, విద్యుత్ వైర్లు దగ్ధమై రైతులు ఆర్థిక నష్టపోతున్నారని తెలిపారు. పచ్చని ప్రకృతి, ఈత--తాటి వనాలు దగ్ధమవడం వల్ల కల్లుగీత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, రైతులు పొలాల్లో నీరు పట్టించి కొయ్యలను కలియదున్నితే అవి ఎరువుగా మారి పంట దిగుబడి పెరుగుతుందని సూచించారు. ఇకపై గ్రామంలో ఎవరైనా వరి కొయ్యలను కాల్చితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వరి కొయ్యలను కాల్చడం నేరమని సర్పంచ్ తిరుమల రైతులకు స్పష్టం చేశారు.

# వర్షాకాల సన్నద్ధతపై మేయర్ శ్రీనివాస్ కీలక సూచనలు



**కరీంనగర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శానిటేషన్ వింగ్ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ వర్షాకాల సన్నద్ధత, పారిశుధ్య నిర్వహణపై కీలక సూచనలు చేశారు. నగరంలోని ప్రధాన నాలాలు, మురుగు కాలువల పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా మోటార్ పంపులు సిద్ధంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. తడి--పొడి చెత్తను విడిగా సేకరించే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి, డంపింగ్ యార్డుకు తరలించి బయో మైనింగ్, కంపోస్టింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మార్కెట్లు, వాణిజ్య ప్రాంతాల్లో రాత్రివేళ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, కార్మికులకు రక్షణ పరికరాలు అందజేయాలని ఆయన పేర్కొన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. భారీ వర్షాలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ ఏర్పాటు చేసి, 24 గంటల కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్ అందుబాటులో ఉండాలని మేయర్ ఆదేశించారు. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంచేందుకు ప్రచారం నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలని ఆయన హెచ్చరించారు. నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని మేయర్ పిలుపునిచ్చారు.

# శ్రీశైలంలో దత్తాత్రేయ స్వామికి విశేషపూజలు

**శ్రీశైలం, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీశైల దేవస్థానంలో గురువారం త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. ప్రతి గురువారం దేవస్థాన సేవగా జరిగే ఈ కైంకర్యంలో ముందుగా మహాగణపతిపూజ అనంతరం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయస్వామి శ్రీశైలక్షేత్రానికి ప్రత్యేక సంబంధం కలిగి ఉన్నారని పురాణాలు చెబుతున్నాయి. త్రిఫలవృక్షం క్రింద ఆయన తపస్సు చేసినట్లు ప్రతీతి. కలియుగంలో శ్రీపాదవల్లభునిగా, అనంతరం మహారాష్ట్రలో నృసింహసరస్వతిగా అవతరించి శ్రీశైలంలో చాతుర్మాస్య వ్రతం, మహాశివరాత్రి సేవలు నిర్వహించినట్లు గురుచరిత్రలో పేర్కొనబడింది. నృసింహసరస్వతి స్వామి తన అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేసి, అదృశ్య రూపంలో భక్తులను రక్షిస్తున్నారని విశ్వాసం. ప్రతి గురువారం శ్రీశైలంలో దత్తాత్రేయస్వామికి విశేషపూజలు నిర్వహిస్తున్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించిన ఎంపీవో



**ఖానాపూర్, జూన్ 12 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీవో సి రత్నాకర్ రావు పర్యటించారు. బీర్‌నంది, కొలం గూడా పాఠశాలల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి, గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం దృష్ట్యా గ్రామ వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, మురుగు కాలువల పూడిక తొలగించాలని, ఖాళీ ప్రదేశాల్లో చెత్త లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని పంచాయతీ పాలకవర్గాలను ఆదేశించారు. అనంతరం గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, వర్షాకాలం రాకముందే గృహాలను పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. వర్షాకాలానికి ముందే పారిశుధ్య పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఎంపీవో రత్నాకర్ రావు సూచించారు.

## ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన ఆశ్రమ పాఠశాల విద్యార్థి వంశీ

**ఖానాపూర్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ఖానాపూర్ బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతిలో 575 మార్కులు సాధించిన లావుడియా వంశీకి మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. మారుమూల గ్రామమైన బావాపూర్ తండాకు చెందిన వంశీ విజయంపై తండ్రి వసంతరావు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుగ్లావత్ రాజేందర్, ఉపాధ్యాయులు వంశీని అభినందించారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థి వంశీ ప్రతిభతో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు.

## ఎక్సైజ్ దాడుల్లో నాటు సారాయి స్వాధీనం

**నందికొట్కూరు, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



నంద్యాల జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ ఆదేశాల మేరకు షికారి కాలనీలో దాడులు జరిపి 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అదనంగా ఒక మహిళ వద్ద ఐదు లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు రమేష్ బాబు, భాష్యం, శ్రీనివాసులు, జఫరుల్లా, హెడ్ కానిస్టేబుల్ పద్మనాభం, కృపావర, కుమారి, కానిస్టేబుళ్లు ఎం. శివన్న, చిన్న ఓబులేసు, పాములేటి, బి. నాగరాజు, రవికుమార్, శ్వేతా రాణి తదితరులు పాల్గొన్నారు. బెల్లం ఊటను ధ్వంసం చేసి నాటు సారాయి స్వాధీనం చేసిన ఎక్సైజ్ అధికారులు.

## పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన సీపీ గౌష్ ఆలం




**హుస్నాబాద్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: సైదాపూర్ పోలీస్ స్టేషన్‌ను కమిషనర్ గౌష్ ఆలం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ, రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించి పెండింగ్ కేసులను వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. గ్రామాలను సెక్టార్లు, సబ్‌సెక్టార్లుగా విభజించి గ్రామ పోలీస్ అధికారులను కేటాయించాలని, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆయన ఆదేశించారు. రిసెప్షన్, కోర్టు డ్యూటీ, బీట్, పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో సిబ్బంది నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. మహిళా సిబ్బంది విశ్రాంతి గదుల సౌకర్యాలను పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్‌హెచ్‌వో కొప్పుల స్వాతి, ఇతర అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. సైదాపూర్ పీఎస్ తనిఖీలో సీపీ గౌష్ ఆలం కీలక సూచనలు చేశారు.

# నేటి రాశి ఫలితాలు

## 12-06-2026





**మేషరాశి**
సోదరులతో వివాదాలు పరిష్కారమవుతాయి. ఉద్యోగులకు శుభవార్తలు అందుతాయి. నిరుద్యోగులకు అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఆస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. అదృష్ట రంగు :ఎరుపు
సంఖ్య :4

**వృషభరాశి**
రావలసిన సొమ్ము సకాలంలో వసూలవుతాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు ఉన్నప్పటికీ సకాలంలో పూర్తి చేస్తారు. ఆప్తుల నుండి ఆసక్తికర విషయాలు తెలుస్తాయి. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి. అదృష్ట రంగు: తెలుపు
సంఖ్య: 5

**మిధునరాశి**
దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని భారం వలన తగిన విశ్రాంతి లభించదు. ఇంటా బయట చికాకులు పెరుగుతాయి. వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణించవు. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. విద్యార్థుల పోటీ పరీక్షల్లో మిశ్రమ ఫలితాలు అందుతాయి. అదృష్ట రంగు: ఆకుపచ్చ సంఖ్య: 6

**కర్కాటకరాశి**
చేపట్టిన పనులులో శ్రమాధిక్యత పెరుగుతుంది. వ్యాపార వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. కీలక వ్యవహారాలలో మాట పట్టింపులు ఉంటాయి. నిరుద్యోగుల ప్రయత్న లోపం వలన లభించిన అవకాశాలు చేజారుతాయి. ధన వ్యవహారాలలో కొంత అప్రమత్తంగా వ్యవహరించాలి. అదృష్ట రంగు :వెండి రంగు
సంఖ్య :7

**సింహరాశి**
నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. మిత్రులతో చర్చలు ఫలిస్తాయి. వ్యాపారాలలో నష్టాలు భర్తీ అవుతాయి. గృహమున సంతాన శుభకార్యములు నిర్వహిస్తారు. అవసరానికి చేతికి డబ్బు అందుతుంది. ఉద్యోగాలలో సమస్యల నుండి బయటపడతారు. అదృష్ట రంగు: బంగారు రంగు
సంఖ్య: 8

**కన్యరాశి**
రావలసిన ధనం చేతికి అందుతుంది. కుటుంబ సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. నూతన వస్తు వాహనం కొనుగోలు చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వృత్తి, ఉద్యోగాలలో ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. అదృష్ట రంగు :ఆకుపచ్చ సంఖ్య :9

**తులరాశి**
ఋణదాతల ఒత్తిడి నుండి బయటపడటానికి నూతన ఋణాలు చేస్తారు. జీవిత భాగస్వామితో ఆలయాలు సందర్శిస్తారు. చేపట్టిన పనుల్లో స్వల్ప అవరోధాలుంటాయి. కుటుంబ సభ్యులతో దూరప్రయాణాలు చేస్తారు. వ్యాపారాలలో ఆర్థిక నష్టాలుంటాయి. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. అదృష్ట రంగు :తెలుపు
సంఖ్య:1

**వృశ్చికరాశి**
నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహం కలిగిస్తాయి. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడులు పెరుగుతాయి. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అప్పగించిన బాధ్యతలు నిర్వహించడంలో విఫలమౌతారు. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఆస్తి వ్యవహారాలలో వివాదాలు కలుగుతాయి. అదృష్ట రంగు :మెరున్
సంఖ్య :2

**ధనస్సురాశి**
సంఘంలో ప్రముఖుల నుండి విశేషమైన సహకారం లభిస్తుంది. వివాదాలకు సంబంధించి కీలక సమాచారం అందుతుంది. వ్యాపారస్తులకు నూతన పెట్టుబడులు అందుతాయి. మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో తెలివిగా సమస్యల నుండి బయటపడతారు. అదృష్ట రంగు: పసుపు సంఖ్య:3

**మకరరాశి**
వ్యాపారాలు మరింత మందగిస్తాయి. ఉద్యోగులకు సహోద్యోగులతో మనస్పర్ధలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ వాతావరణం చికాకు కలిగిస్తుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. అదృష్ట రంగు :నీలం
సంఖ్య :4

**కుంభరాశి**
ఇంటా బయట కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వృత్తి వ్యాపారమున వ్యవహార అనుకూలత కలుగుతుంది. కొన్ని సంఘటనలు గుర్తు చేసుకుని బాధపడతారు. ఉద్యోగస్థులకు నూతన అవకాశములు లభిస్తాయి. ఉద్యోగమున అనుకూల మార్పులు ఉంటాయి. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. అదృష్ట రంగు :నీలం సంఖ్య :5

**మీనరాశి**
ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. సన్నిహితుల నుండి వివాద విషయమై కీలక సమాచారం అందుతుంది. ఉద్యోగాలలో శ్రమకు తగిన ఫలితం ఉండదు. చేపట్టిన పనులు నిదానంగా పూర్తవుతాయి. కొన్ని విషయాలలో తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. సంతాన శుభకార్యాల విషయమై ప్రస్తావన వస్తుంది. అదృష్ట: రంగు పసుపు సంఖ్య:6

**( రాశి ఫలాలు నిపుణులు సలహాలతో పరిగణించాలి )**

**శ్రీ కాలభైరవ ఉపవాసకులు**
**డక్క జంబు లయ్య**
**9491163914**



## నల్లెల గ్రామంలో పలువురిని పరామర్శించిన మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్





ప్రొద్దుటూరు వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్



**కురవి , జూన్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
డోర్నకల్ నియోజకవర్గం కురవి మండలంలోని నల్లెల గ్రామ మాజీ సర్పంచ్ గుండెబోయిన సూరయ్య సతీమణి ఉప్పలమ్మ కాలుకు శస్త్రచికిత్స చేయించుకోవడంతో నేడు వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని పరామర్శించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అలాగే గుండె సంబంధిత శస్త్రచికిత్స చేయించుకుని ఇటీవల ఇంటికి చేరుకున్న పోతుగంటి శ్రీనివాస్ చారి గారిని, పక్షవాతానికి గురైన కయ్యల సత్యం గారిని వారి నివాసాల్లో పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



అనంతరం ఇటీవల మరణించిన బండి వీరన్న, పొద్దుటూరి వెంకన్న మరియు వీఆర్ఏ సయ్యద్ హుస్సేన్ సతీమణి జనిబీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ ధైర్యం చెప్పారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుగులోత్ శ్రీరామ్ నాయక్, ఐలి నరహరి గౌడ్, బోడ శ్రీను నాయక్, గుగులోత్ నెహ్రూ నాయక్, పల్ల వెంకట్రాం, నరసింహారెడ్డి, పల్ల సత్తిరెడ్డి, బండి దీపక్ గౌడ్, ఉప సర్పంచ్ నిమ్మలగంటి కృష్ణమూర్తి, వార్డు సభ్యుడు ఎడ్ల ఉప్పలయ్య, అంబటి కర్ణాకర్, ధర్మారపు పుష్ప, తోట రాములు, కొండలరావు తదితరులు ఉన్నారు.

# శిధిలావస్థకు చేరుకున్న వాటర్ ట్యాంక్




-ఏ క్షణంలోనైనా కూలిపోవచ్చు

-గ్రామ పాలకవర్గం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.



పగలబడ్డ పిల్లర్లు



శిధిల వ్యవస్థలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

**సర్పంచ్ ప్రవీణ్ ఎలిగేడు**

**అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.**



శిధిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ ను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా వాటర్ ట్యాంక్ ను తొలగిస్తాం.

**ఎంపీడీవో భాస్కర్ రావు ఎలిగేడు**

**అధికారులను ఆదేశిస్తాం**



శిధిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్ ను పరిశీలించేందుకు ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ కి ఆదేశాలు జారీ చేస్తాం. ఏఈ పరిశీలించి ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

**ఎలిగేడు, జూన్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎలిగేడు గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉన్ని కేంద్రం ఆవరణలో దశాబ్దాల క్రితం వాటర్ ట్యాంక్ ను నిర్మించారు. ఇప్పుడు ఆ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉంది. పిల్లర్లు పగుళు పట్టి, ట్యాంక్ స్లాబ్ పెచ్చులూడి పడుతూ ఇనుప చువ్వలు తేలి దర్శనమిస్తుంది. వర్షానికి పెచ్చులూడి పడుతున్నాయి. ట్యాంక్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో గ్రామంలో యువత ఆటలు ఆడుతూ ఉంటారు. మరో పక్కన నివాస గృహాలు ఉన్నాయి. దాంతో ట్యాంక్ ఎప్పుడు కులుతుందోనని భయాందోళనతో బిక్కుబిక్కుమని గడుపుతున్నారు. ప్రమాదం జరగకముందే గ్రామ పాలకవర్గం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నిరుపయోగంగా శిధిలావస్థకు చేరుకున్న ట్యాంక్‌ను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# భారత రాష్ట్ర సమితిలో భారీ చేరికలు

**కల్వకుర్తి, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు జరిగాయి. విద్యార్థి సంఘాల నుంచి పలువురు నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాల ఆకర్షణతో గులాబీ కండువా కప్పించుకొని పార్టీలో చేరారు.ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి పనిచేసిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని, ఆయన పాలనలో రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి, నేడు మాట తప్పి ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని మండిపడ్డారు. రైతులు ఇబ్బందులు పడుతున్నారని, యువతకు ఉపాధి అవకాశాలు తగ్గాయని, అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలు కాంగ్రెస్ వైఫల్యాలను గమనిస్తూ తిరిగి బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని ఆయన అన్నారు. పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేసిన పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని, కేసీఆర్ నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎద్మ సత్యం, మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య, జిల్లా నాయకులు నాగులు నాయక్, సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ పవన్ కుమార్, వెల్దండ మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, ఉప సర్పంచ్ నర్సింహా, కౌన్సిలర్ రామ్ నాయక్, మాజీ కౌన్సిలర్ సైదులు, మాజీ సర్పంచ్ అరుణ ప్రభాకర్, నాయకులు షాహిద్, తిరుపతి రెడ్డి, శేఖర్, మక్రం, సురేష్, అంజినాయక్, అంజిమాస్టార్, ప్రవీన్, రమేష్, శంకర్ నాయక్, జంగిలి ప్రవీణ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజన సదుపాయం

**-విద్యార్థుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టి**



**మెదక్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించింది.జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి మాట్లాడుతూ, 2026--27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లోనూ విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రవేశాలు పొందుతున్నారని వెల్లడించారు.ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని ఆమె సూచించారు.జిల్లాలో అడ్మిషన్ల ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి తెలిపారు.

## రైతులు అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటపై దృష్టి సారించాలి

**ఎలిగేడు మండలంలో ఆయిల్‌పామ్ తోటలను సందర్శించిన జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమలశాఖ అధికారి గడ్డం శ్యాం ప్రసాద్**



తోటలు పరిశీలిస్తున్న ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి గడ్డం శ్యాం ప్రసాద్

**ఎలిగేడు, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆయిల్‌పామ్ సాగు దీర్ఘకాలికంగా స్థిరమైన అధిక ఆదాయం అందించే వాణిజ్య పంటగా రైతులకు మంచి భవిష్యత్తును కల్పిస్తుందని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమలశాఖ అధికారి గడ్డం శ్యాం ప్రసాద్ అన్నారు.ఎలిగేడు మండలంలోని లోకపేట గ్రామంలో ఆయిల్‌పామ్ తోటలను క్షేత్రస్థాయిలో సందర్శించి రైతులతో సమావేశమయ్యారు. రైతు వావిలాల రాజేశ్వరరావు 2022--23 సంవత్సరంలో 31 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టగా, అందులో 19 ఎకరాలు ఇప్పటికే కోత దశకు చేరుకున్నాయి. తోట నిర్వహణ, మొక్కల పెరుగుదల, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం వంటి అంశాలను పరిశీలించారు.మొదటి కోతలో ఎకరాకు సుమారు మూడు టన్నుల తాజా పండ్ల గుత్తులు దిగుబడి లభించే అవకాశం ఉందని, ప్రస్తుతం టన్ను ధర రూ. 2,852 ఉండడంతో రైతులకు మొదటి కోతలోనే ఎకరాకు సుమారు రూ. 1.5 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి కోత వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.రైతు అనుసరిస్తున్న శాస్త్రీయ సాగు పద్ధతులను అభినందిస్తూ, జిల్లాలోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపి విస్తీర్ణాన్ని మరింత పెంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తిరుమల ఆయిల్‌కేం ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ కేశు కల్యాంకర్, సాంకేతిక ఉద్యాన అధికారి సుంక మహేష్, ఉద్యాన విస్తరణ అధికారులు రాము, మహేష్, ఫీల్డ్ ఆఫీసర్ ఎన్. అభిలాష్, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా డీఎస్సీడిఓగా గుర్రం సురేష్ బాధ్యతలు స్వీకరణ

-లిస్వాగతం పలికిన మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ





**యాదాద్రి భువనగిరి, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ యాదాద్రి జిల్లా డీఎస్సీడిఓగా గుర్రం సురేష్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ, సూపరింటెండెంట్ మంగళంపల్లి జ్యోతిర్మయి, భువనగిరి ఏఎస్‌సీడిఓ సుమంత్, బీసీ వెల్ఫేర్ ఏబీసీడబ్ల్యూ ఓ సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి. విజయ్, రామ్ చందర్, అనురూప, హెచ్‌డబ్ల్యూ ఓ అసోసియేట్ ప్రెసిడెంట్ కే. ఆనంద్, నాగ సైదులు, క్లాస్ ఫోర్త్ అసోసియేషన్ నాయకుడు జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గుర్రం సురేష్‌కు పూల బొకే అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన పరిచయ కార్యక్రమంలో ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో ఖాళీగా ఉన్న మూడు జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని కోరారు.డీఎస్సీడిఓ గుర్రం సురేష్ మాట్లాడుతూ, పాలనాపరంగా పనులను వేగవంతం చేయాలని, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సేవలో తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసిన గుండాల గ్రామ ప్రజాప్రతినిధులు



**వెల్దండ, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామ పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, సర్పంచుల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిను గ్రామ ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు.ఈ సందర్భంగా గ్రామ సమస్యలను వివరించిన ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన సర్పంచులందరితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గుండాల గ్రామ సర్పంచ్ జక్కుల శిరీష వెంకటేష్ యాదవ్, డిప్యూటీ సర్పంచ్ కొమ్ము లింగం, వార్డు సభ్యులు విజయ్ కుమార్, ఏకుల పార్వతమ్మ, కిసాన్ సెల్ తాలూకా అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, కమిటీ సభ్యులు కొమ్ము లింగం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చిన ఉప్పల వెంకటేశ్



**వెల్దండ, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని సిలోని బండతండా, పోచమ్మతండా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామాభివృద్ధి సమస్యలపై చర్చించేందుకు మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.గ్రామ సమస్యలు, అభివృద్ధి అవసరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, ఉప్పల వెంకటేశ్ సానుకూలంగా స్పందించారు. గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో రాత్లావత్ లచ్చిరాం, తుకారం, మల్లేష్, రాంలాల్, వినోద్, సురేష్, కిరణ్, శ్రీను, చందర్, మున్నా, అజిలాపూర్ గ్రామ సర్పంచ్ రమేష్, జగన్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

**మెదక్ జిల్లా ఉద్యమకారుల సమన్వయ కమిటీ పిలుపు**



**మెదక్, జూన్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని మెదక్ జిల్లా ఉద్యమకారుల సమన్వయ కమిటీ సమన్వయకర్తలు బి. కొండల్ రెడ్డి, సడమెలా యాదగిరి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్లో జరిగిన సమావేశంలో మెదక్, హవేలీ ఘనపూర్, వెల్దుర్తి, రామయంపేట, శంకరంపేట, కొల్చారం, పాపన్నపేట మండలాల ఉద్యమకారులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా ఉద్యమకారులను గుర్తించడంలో గత పాలకులు నిర్లక్ష్యం వహించారని, ప్రస్తుత ప్రభుత్వం అయినా ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన వారందరినీ గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలో తెలంగాణ అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయాలని, ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ కార్మికులను ఉద్యమకారులుగా గుర్తించాలని తీర్మానించారు. జర్నలిస్టులను గుర్తించి తగిన న్యాయం చేయాలని, ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, 1969 ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ గుర్తించి న్యాయం చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో భూపాల్ రెడ్డి, జెల్లా సుధాకర్, మేడిశెట్టి శ్యామ్ రావు, మల్లికార్జున గౌడ్, మామిండ్ల ఆంజనేయులు, కిరణ్ గౌడ్, శ్రీకాంత్, రూపేష్, యాదవ్, మనోహర్, శివాజీ, రఘు, ఏ. రాధాకిషన్, డి. జీవరత్నం, కే. బాగయ్య, పి. శ్రీనివాస్ రెడ్డి, పృథ్వీరాజ్ గౌడ్, వెంకటరమణ, జగదీష్ చంద్ర, దేవయ్య, బి. ముత్యాలు, సంగయ్య, యాదగిరి, కంది శ్రీనివాస్ రెడ్డి, బొందుగుల నాగరాజు, శంకర్ దయాల్ చారి, సురేందర్ రెడ్డి, సుధాకర్, ఫజల్ అహ్మద్, మల్లారెడ్డి, చల్ల రవీందర్, భీమరి శ్రీనివాస్, గట్టేష్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఆందోళనకారులపై కాల్పులు..

**-16 మంది మృతి..**

**37 మందికి గాయాలు**



**న్యూఢిల్లీ జూన్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఆందోళనలు ఆగడం లేదు. నిరసనకారులకు, పాక్ ఆర్మీకి మధ్య ఘర్షణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం ఆందోళనకారులపై పాక్ ఆర్మీ కాల్పులు జరిపింది. ఈ ఘటనలో 16 మంది మరణించగా, 37 మందికి పైగా గాయపడ్డారు. పీవోకే పరిధిలోని రావల్‌కోట్‌లోని ఈద్గా గ్రౌండ్‌లో ఆందోళనకారులు నిరసనలు చేస్తుండగా, వారిపై పాక్ ఆర్మీ కాల్పులు జరిపింది. నిరాయుధులైన వేలమంది ఇక్కడ ఆందోళన చేస్తుండగా వారిపై పాక్ ఆర్మీ విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లో ప్రజలకు సరైన హక్కులు దక్కడం లేదు. దీంతో అక్కడివారు తమకు తక్కువ ధరకే బియ్యం, పిండి, విద్యుత్ వంటివి అందించాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళనల్ని అణచివేయడానికి పాక్ ప్రభుత్వం హింసాయుత చర్యలకు దిగుతోంది. తాజా ఘటనకు సంబంధించి గురువారం 60,000 నుంచి 70,000 మంది స్థానికులు ఇక్కడ సమావేశమయ్యారు. పురుషులు, స్త్రీలు, యువత సహా అందరూ ఆందోళన చేస్తుండగా ఆర్మీ కాల్పులు జరిపింది. ఘటన తర్వాత ఆ ప్రదేశమంతా రక్తపు మరకలతో నిండిపోయింది. గత శుక్రవారం నుంచి పీవోకేలో ఆందోళనకారులపై పాక్ జరిపిన కాల్పుల్లో 57 మంది మరణించారు. వందల మంది గాయపడ్డారు. పాక్ ఆర్మీ ఇంతగా అణచివేస్తున్నా అక్కడి ప్రజలు తమ ఆందోళనల్ని విరమించడం లేదు. తమకు హక్కులు కావాలని, ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పాక్ ప్రభుత్వ చర్యలపై మండిపడుతున్నారు. ఆర్మీ సిబ్బంది తీవ్రవాదుల్లా ప్రవర్తిస్తూ దాడులు చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

## 49 తోమాహాక్ క్షిపణులను ఫైర్ చేసిన అమెరికా..

**-వీడియో రిలీజ్ చేసిన సెంట్రల్ కమాండ్**



**న్యూయార్క్ జూన్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఇరాన్, అమెరికా మధ్య మళ్లీ ఉద్రిక్తత పెరిగింది. ఆ రెండు దేశాలు మళ్లీ పరస్పర దాడులకు దిగాయి. ఆత్మరక్షణలో భాగంగా ఇరాన్‌లోని పలు టార్గెట్లపై జూన్ 10వ తేదీన అమెరికా దాడులు చేసినట్లు సెంట్రల్ కమాండ్ చెప్పింది. అమెరికా మిలిటరీ సుమారు 49 తోమాహాక్ క్షిపణులను ఫైర్ చేసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియోను తాజాగా యూఎస్ సెంట్రల్ కమాండ్ రిలీజ్ చేసింది. యూఎస్ఎస్ మిచ్చెల్ మర్ఫీ యుద్ధ నౌక నుంచి తోమాహాక్ క్షిపణులను ఫైర్ చేశారు. ఈ ఆపరేషన్‌ను అధ్యక్షుడు ట్రంప్ కన్ఫర్మ్ చేశారు. ఇరాన్‌లోని మిలిటరీ నిఘా కేంద్రాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఎయిర్ డిఫెన్స్ కేంద్రాలను ఆ క్షిపణులతో అమెరికా అటాక్ చేసింది. యూఎస్ మెరైన్ కార్ప్స్, ఎయిర్ ఫోర్స్, నేవీ .. సంయుక్తంగా ఇరానీ టార్గెట్లను పేల్చేసినట్లు సెంట్రల్ కమాండ్ తన ప్రకటనలో చెప్పింది. హోర్ముజ్‌లో అంతర్జాతీయ నౌకలకు ఇబ్బందికరంగా మారిన ఇరానీ క్షేత్రాలను టార్గెట్ చేసినట్లు అమెరికా పేర్కొన్నది. అమెరికా సేనలు నిత్యం అప్రమత్తంగా, ఆయుధ సామర్థ్యంతో ఉన్నాయని సెంట్రల్ కమాండ్ తెలిపింది.

## పొంచి ఉన్న ఆహార కొరత ముప్పు

**--భారత వృద్ధి 6.6 శాతమే..!**

**-- ప్రపంచ వృద్ధి రేటు 2.5 శాతంగా ఉండొచ్చు**

**-- ఎరువుల కొరత పెరగొచ్చు**

**-- ప్రపంచ బ్యాంక్ అంచనా**





**వాషింగ్టన్ జూన్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు భారీగా పెరగడం, మార్కెట్లలో అనిశ్చితి నెలకొనడం వల్ల ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు కేవలం 2.5 శాతానికే పరిమితం కానుందని ప్రపంచ బ్యాంక్ గురువారం హెచ్చరించింది. ఆరేళ్ల క్రితం అంతర్జాతీయ వాణిజ్యాన్ని అతలాకుతలం చేసిన కోవిడ్-19 మహమ్మారి తర్వాత ఇదే అత్యంత బలహీనమైన ఆర్థిక వృద్ధి కావడం గమనార్హం. ఈ సంక్షోభం కారణంగా ప్రపంచంలోని మూడింట రెండు వంతుల దేశాల వృద్ధి రేటు అంచనాలను బ్యాంక్ సవరించింది. అమెరికా అతిపెద్ద ఇంధన ఉత్పత్తి దారు, ఏఐ రంగంలో పెట్టుబడుల వల్ల అమెరికా 2.2 శాతం వృద్ధిని నమోదు చేయొచ్చని అంచనా వేసింది. యుద్ధ ప్రభావంతో అభివృద్ధి చెందుతున్న వర్ధమాన మార్కెట్ దేశాల 2026 వృద్ధి రేటు అంచనాను ప్రపంచ బ్యాంక్ 0.4 శాతం తగ్గించి 3.6 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. చైనా వృద్ధి రేటు ఈ ఏడాది 4.2 శాతంగా అంచనా వేయగా.. 21 యూరోపియన్ దేశాల వృద్ధి కేవలం 0.8 శాతానికి పడిపోనున్నాయి. భారతదేశం ప్రస్తుత ఏడాది 6.6 శాతం ఆర్థిక వృద్ధి రేటుకు పరిమితం కావొచ్చని అంచనా వేసింది. గతేడాది సాధించిన 7.7 శాతం వృద్ధితో పోలిస్తే ఈసారి కొంత మందగిస్తుందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది.

## సీట్ చోరీ ప్రారంభించిన బీజేపీ..

**- ఈసీ, బీజేపీ మధ్య జుగల్‌బంధీ..**

**- కేంద్రంపై రాహుల్ గాంధీ ఆరోపణ**



**న్యూఢిల్లీ జూన్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సర్కార్ చోరీ, వోట్ చోరీ తర్వాత ఈసీ, బీజేపీ కలిసి ఇప్పుడు సీట్ చోరీకి పాల్పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బీజేపీ, ఈసీ జుగల్‌బంధీ కొనసాగుతోందని, పోటీ మొదలుకాకముందే ముగించేశారని రాహుల్ విమర్శించారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "బీజేపీ, ఈసీ కలిసి సర్కార్ చోరీ, వోట్ చోరీ తర్వాత సీట్ చోరీకి పాల్పడింది. రాజ్యసభ ఎన్నికల్లో ఏం జరిగిందో చూడండి. మీనాక్షి నటరాజన్ అన్ని డాక్యుమెంట్లు సమర్పించారు. ఒక్క పెండింగ్ కేసు లేదు. కానీ, బీజేపీకి అనుకూలంగా ఈసీ ఆమె నామినేషన్ తిరస్కరించింది. బీజేపీ మద్దతు ఇచ్చిన పరిమళ్ నత్వాన్‌జీ తన పేరునే తప్పుగా రాశాడు. అనేక వివరాలు వెల్లడించలేదు. కానీ, ఈసీ అతడికి అన్ని మినహాయింపులు ఇచ్చింది. ఒకే ఎన్నికల సంఘం. ఇద్దరు అభ్యర్థులు. ఒకరి వాదన వినకుండానే వారిని తిరస్కరించారు. ఇంకొకరికి రూల్స్ ఫాలో అవ్వకుండానే విజయాన్నిచ్చింది. మేం ఎన్నికల సంఘాన్ని కలవాలి అనుకుంటే మా నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించారు. తర్వాత మేం కలిస్తే మాకు ఒక్క విషయం కూడా చెప్పలేదు. ఇలాంటివి ఇంకా చూడొచ్చు. ఎన్నికల్లో గెలవడంకంటే వాటిని తారుమారు చేయడం బీజేపీకి చాలా సులభం" అని రాహుల్ గాంధీ విమర్శించారు. మధ్యప్రదేశ్ రాజ్యసభ స్థానానికి కాంగ్రెస్ తరఫున మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన రాజ్యసభ నామినేషన్‌ను ఈసీ తిరస్కరించిన సంగతి తెలిసిందే.

## జూన్ 30 తర్వాత పేపర్ నోట్లు చెల్లవా..?

**సోషల్ మీడియా ప్రచారంలో నిజమెంత..? ఆర్బీఐ ఏం చెప్పిందంటే**




**న్యూఢిల్లీ జూన్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆర్బీఐ త్వరలో ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టబోతున్నట్లు ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సోషల్ మీడియాలో ఒక ప్రచారం జరుగుతోంది. జూన్ 30 తర్వాత నుంచి దేశంలో పేపర్ నోట్లు చెల్లబోవు అనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం చెలామణిలో ఉన్న పేపర్ కరెన్సీ నోట్లను జూన్ 30 తర్వాత ఆర్బీఐ నిషేధించిందని, ఆ తర్వాత నుంచి ఈ నోట్లు చెల్లవని ప్రచారం జరుగుతోంది. వీటి స్థానంలో ప్లాస్టిక్ రాబోతున్నట్లు వాట్సాప్ సహా కొన్ని సోషల్ మీడియా అకౌంట్లలో షేర్ అవుతోంది. దీంతో 2016లో ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేసినప్పటి పరిస్థితులు ఎదురవుతాయేమో అనే భయం ప్రజల్లో కనిపిస్తోంది. అయితే, ఈ ప్రచారంపై ఆర్బీఐ స్పందించింది. ప్రభుత్వ ప్రచారాలపై నిగ్గు తేల్చే ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ప్రకారం ఈ ప్రచారంలో నిజం లేదని తేల్చింది. ఆర్బీఐ ఇలాంటి ప్రకటన ఏమీ చేయలేదని వివరించింది. పేపర్ నోట్ల స్థానంలో, ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టే ఆలోచన ప్రస్తుతానికి ఆర్బీఐ చేయలేదని తెలిపింది. వినియోగదారులు ఈ ప్రచారాన్ని నమ్మవద్దని, ఇటువంటివి ప్రచారమైనప్పుడు వాస్తవాలు తెలుసుకోవాలని సూచించింది.

## పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, జూన్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల్ పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో గురువారం మండలానికి సంబంధించిన 180మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆడబిడ్డ పెళ్లికి అసరాగా నిలిచేందుకు రూ. 1 లక్ష అందజేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత బస్సు, ఉచిత కరెంట్, సన్నబియ్యం అందించడం ద్వారా పేదలకు మేలు చేశామన్నారు. గత పదేళ్లలో ఎక్కడా ఒక్క డబుల్ బెడ్రూం ఇళ్లు కూడా ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వంలో ఊరూరా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, తహసిల్దార్ జయశ్రీ, ఎంపిడిఓ సుజాత, ఏంఈఓ రాజేశ్వరి, సర్పంచ్ రాయికంటి బిక్షపతి, మండల అధ్యక్షులు బిచ్యా నాయక్, డోకూరి ప్రభాకర్ రెడ్డి, అంజయ్య గుప్తా, సుమన్ గౌడ్, శేఖర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## బాలాజీ తాపీ మేస్త్రి సంఘం ఆధ్వర్యంలో నిరసన




**ఆమనగల్లు, జూన్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ మండల కేంద్రంలో శ్రీ బాలాజీ తాపీ మేస్త్రి సంఘం ఆధ్వర్యంలో సంఘం భవనం వద్ద గురువారం ధర్నా, నిరసన చేపట్టారు. ఇంటి నిర్మాణ దారులు మరియు భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, పెరిగిన సెంట్రింగ్ మరియు కూలీల ధరలకు, తాము నష్టపోతున్నామంటూ సంఘం నాయకులు వాపోయారు. కాంట్రాక్టర్లు, నూతనంగా నిర్మిస్తున్న ఇంటి యాజమాన్యులకు, వారికి ఇస్తున్న ధరలకు తాము నష్టపోతున్నామని తెలిపారు. నూతనంగా నిర్మాణం చేపట్టే యజమాన్యులు తమ యొక్క ధరలను పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రెండు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా తాపీ మేస్త్రీల సంఘాల ఆధ్వర్యంలో నిర్మాణ పనులను నిలిపి పెద్ద ఎత్తున ధర్నాలు నిరసనలు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో. చంద్రయ్య, శ్రీరాము, వెంకటేష్ జంగయ్య, శ్రీను, బాబు, మల్లేష్, కోటయ్య, మల్లేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసే కాంగ్రెస్ లోకి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, ౧ జూన్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి గ్రామానికి చెందిన కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి ఉప్పెనమోని తిరుపతయ్య గురువారం కడ్తాల్ పట్టణ కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే కసిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతీ గ్రామాన్ని మోడల్ విలేజ్ గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, సర్పంచ్ రాయికంటి బిక్షపతి, మండల అధ్యక్షులు బిచ్యా నాయక్, డోకూరి ప్రభాకర్ రెడ్డి, అంజయ్య గుప్తా, సుమన్ గౌడ్, శేఖర్ గౌడ్, రాజేందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

## నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్య విరుద్ధం

**- డైరెక్టర్ అజీమ్**



**ఆమనగల్లు, జూన్ 11 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మధ్యప్రదేశ్ లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషనన్ ను తిరస్కరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ అజీమ్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఆమెపై ఎలాంటి కేసులు లేవని, బీజేపీ రాజకీయ కుట్రలతోనే వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై న్యాయం జరిగే వరకు న్యాయస్థానాల్లో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రతిపక్ష గొంతులను పరిపాలనా ప్రక్రియల ద్వారా అడ్డుకునే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే నాయకురాలని, రాజ్యసభలో ప్రజల తరఫున బలమైన గొంతుకగా నిలిచేవారన్నారు.

# బిజినెస్

## పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు..

**-నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు**



పశ్చిమాసియా లో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఇవాళ్టి ట్రేడింగ్‌లో భారత ఈక్విటీ మార్కెట్‌లు నష్టాలతో ముగిశాయి. ఇరాన్ పై అమెరికా తన సైనిక చర్యను తీవ్రతరం చేసిందనే వార్తలతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీనపడింది. రోజంతా ఒడుదొడుకులకు లోనైన సూచీలు చివరికి నష్టాలు మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ 150.63 పాయింట్లు నష్టపోయి 73,832.55 వద్ద, నిఫ్టీ 53.35 పాయింట్లు తగ్గి 23,161.60 వద్ద ముగిశాయి. ఇరాన్‌కు తగినంత సమయం ఇచ్చినా చర్చలకు రాలేదని, ఇప్పుడు పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌పై తీవ్రంగా దాడి చేస్తామని ఆయన స్పష్టం చేయడంతో మార్కెట్లలో ఆందోళన పెరిగింది. దీనికి తోడు అమెరికా దాడుల తర్వాత వ్యూహాత్మకంగా కీలకమైన హార్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించడం ఆందోళనలను మరింత తీవ్రతరం చేసింది. ఈ పరిణామంతో ప్రపంచ చమురు సరఫరాకు అంతరాయం కలుగవచ్చని, ఆర్థిక మార్కెట్లలో అనిశ్చితి పెరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈరోజు ట్రేడింగ్‌లో బ్రాడర్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి మరింత ఎక్కువగా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.81 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.67 శాతం చొప్పున పతనమయ్యాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్, కెమికల్ సూచీలు అత్యధికంగా నష్టపోయాయి. మరోవైపు నిఫ్టీ మీడియా, ప్రైవేట్ బ్యాంక్, ఫార్మా సూచీలు మార్కెట్లకు మద్దతుగా నిలిచి నష్టాలను కొంతమేర తగ్గించాయి. మరోవైపు డాలర్‌కు పెరిగిన డిమాండ్ కారణంగా రెండు రోజుల లాభాల తర్వాత రూపాయి విలువ పడిపోయింది.

## భారీగా తగ్గుతున్న బంగారం, వెండి ధరలు..!

ఇలాంటి రోజులు వస్తాయని మహిళలు ఎప్పుడైనా ఊహించారా? అస్సలు ఊహించి ఉండరు. ఎందుకంటే మహిళలకు బంగారంపై ఉండే మక్కువ అంతా ఇంతా కాదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా బంగారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంటారు మహిళలు. ధరలు ఎంత పెరిగినా షాపులన్నీ మహిళలతో కిటకిటలాడుతుంటాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతున్న బంగారం, వెండి ధరలు ఊహించని విధంగా పతనం అవుతున్నాయి. ధరలు తగ్గుతుంటే మహిళలు ఎగిరిగంతులేస్తున్నారు. రికార్డు స్థాయిలో ధరలు దిగి వస్తుండటంతో ఇంకా తగ్గుతాయోమోనని ఆశల్లో ఉన్నారు. తాజాగా నిన్న తులంపై రూ.4,300 వరకు దిగి వచ్చింది. ఇప్పుడు కూడా ధర తగ్గింది. జూన్ 11వ తేదీన దేశీయంగా తులం బంగారం ధర రూ.1,48,850 వద్ద కొనసాగుతుండగా, వెండి ధర రూ.2,49,900 వద్ద ట్రేడవుతోంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం..



హైదరాబాద్ -- 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,850 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,440 వద్ద కొనసాగుతోంది.

విజయవాడ -24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,850 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,440 వద్ద కొనసాగుతోంది.

ఢిల్లీ -24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,49,900 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,590 వద్ద కొనసాగుతోంది.

ముంబై -- 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,850 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,440 వద్ద కొనసాగుతోంది.

బెంగళూరు -24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,850 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,440 వద్ద కొనసాగుతోంది.

చెన్నై -- 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,50,540 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,37,990 వద్ద కొనసాగుతోంది.

కోల్‌కతా- 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,850 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,440 వద్ద కొనసాగుతోంది.

కేరళ- 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,850 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,36,440 వద్ద కొనసాగుతోంది.

## స్పేస్‌ఎక్స్ బ్లాక్‌బస్టర్ ఐపిఒ

**4400 మంది ఉద్యోగులు కోటీశ్వరులు..!**

న్యూఢిల్లీ
ఎలన్ మస్క్‌కు చెందిన అంతరిక్ష రంగ దిగ్గజం స్పేస్‌ఎక్స్ మార్కెట్ చరిత్రలోనే అత్యంత భారీ పబ్లిక్ ఇష్యూ (ఐపిఒ)కు రానుంది. జూన్ 12న ప్రారంభం కానున్న ఈ ఐపిఒ ద్వారా కంపెనీ ఏకంగా 75 బిలియన్ డాలర్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో గతంలో 2019లో సౌదీ ఆరామ్‌కో నెలకొల్పిన 29.4 బిలియన్ డాలర్ల ఐపిఒ రికార్డును ఇది బద్దలు కొట్టనుంది. ఒక్కో షేరు ధరను 135 డాలర్లుగా (సుమారు రూ.12 వేలకు పైగా) నిర్ణయించగా.. మొత్తం 55.56 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఈ చారిత్రాత్మక ఇష్యూతో కంపెనీ విలువ విపరీతంగా పెరగడమే కాకుండా సంస్థ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే




తొలి ట్రిలియనీర్‌గా అవతరించే అవకాశం ఉంది. ఈ ఐపిఒ ద్వారా కంపెనీలో పనిచేస్తోన్న సుమారు 4,400 మంది ప్రస్తుత, మాజీ ఉద్యోగులు కోటీశ్వరులు కాబోతుండటం విశేషం. గతంలో వీరికి బోనస్‌లు, వేతన పరిహారంగా ఇచ్చిన షేర్ల విలువ ఇప్పుడు ఊహించని స్థాయికి చేరింది. ఒక కంపెనీ ఐపిఒ ద్వారా ఈ స్థాయిలో ఉద్యోగులు సంపన్నులు కావడం మార్కెట్ చరిత్రలో ఇదే తొలిసారి.

# స్పోర్ట్స్

## ప్రపంచకప్‌లో ఫియర్‌లెస్ గేమ్ ఆడుతాం

**టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్**

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో ఫియర్‌లెస్ గేమ్ ఆడుతామని టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. పాకిస్థాన్‌తో జరిగే తొలి మ్యాచ్ నుంచే ఫియర్‌లెస్ అప్రోచ్‌ను అనుసరిస్తామని స్పష్టం చేసింది. దాయాదీ పాకిస్థాన్‌తో ఆదివారం బర్మింగ్‌హామ్ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో హర్మన్‌సేన్ టీ20 ప్రపంచకప్ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. ఈ మెగా టోర్నీకి ముందు రెండు వామప్ మ్యాచ్‌లు ఆడిన భారత్ ఒకటి గెలిచి మరొకటి ఓడింది. ఇంగ్లండ్‌తో వామప్ మ్యాచ్ పరాజయం అనంతరం మీడియాతో మాట్లాడిన హర్మన్‌ప్రీత్ కౌర్.. ఈ మ్యాచ్‌లు మెగా టోర్నీ ప్రారంభానికి ముందు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయని తెలిపింది. 'ఈ రెండు ప్రాక్టీస్ గేమ్స్ మాకు మంచి ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయి. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ.. రిచా ఘోష్ బ్యాటింగ్ మాకు పెద్ద సానుకూల అంశం. క్రీజులో నిలబడితే ఎప్పుడైనా మ్యాచ్‌ను మలుపు తిప్పగలమనే నమ్మకం మాకు కలిగింది. కీలకమైన భాగస్వామ్యాలను నెలకొల్పకపోవడంతోనే ఇంగ్లండ్‌తో




మ్యాచ్‌లో ఓటమిపాలయ్యాం. టీ20 క్రికెట్‌లో మిడిల్ ఓవర్లలో భాగస్వామ్యాలు చాలా కీలకం. అవి మాకు దక్కలేదు. కానీ రిచా అద్భుతంగా బ్యాటింగ్ చేసింది. మెగా టోర్నీకి ముందు జట్టులోని ప్రతీ ప్లేయర్‌కు అవకాశాలు కల్పించడంపై మా మేనేజ్‌మెంట్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. అందరికి తగినన్ని అవకాశాలు వచ్చాయి. టోర్నీలో తొలి మ్యాచ్ నాటికే ఇక్కడి పరిస్థితులపై అవగాహన తెచ్చుకోవడం చాలా కీలకం. తొలి మ్యాచ్‌లోనే పాకిస్థాన్‌ను ఢీకొట్టబోతున్నాం. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఆసక్తిగా చూస్తారనడంలో సందేహం లేదు. బర్మింగ్‌హామ్ మైదానానికి కూడా పెద్ద ఎత్తున వస్తారని భావిస్తున్నా. ప్రేక్షకుల కోలాహలంతో స్టేడియం హోరెత్తిపోతుంది. మేం కూడా మ్యాచ్ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాం. నిర్భయంగా ఆడేందుకు ప్రయత్నిస్తాం. దూకుడును కొనసాగించి విజయం సాధిస్తాం.'అని హర్మన్ ప్రీత్ కౌర్ తెలిపింది. పాకిస్థాన్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లతో భారత్ గ్రూప్-ఏలో ఉంది. మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ ఇప్పటి వరకు టైటిల్ గెలవలేదు. 2020లో ఫైనల్ చేరుకున్నప్పటికీ ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. తాజా ఎడిషన్ అతిపెద్ద టోర్నీగా నిలవనుంది. ఇందులో తొలిసారిగా 12 జట్లు పోటీపడుతున్నాయి. ఆతిథ్య దేశం ఇంగ్లండ్‌తో పాటు, భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, శ్రీలంక, వెస్టిండీస్, న్యూజిలాండ్ జట్లు నేరుగా అర్హత సాధించాయి. బంగ్లాదేశ్, స్కాట్లాండ్, ఐర్లాండ్, నెదర్లాండ్స్ జట్లు క్వాలిఫయర్ల ద్వారా ఈ టోర్నీకి ఎంపికయ్యాయి. ఈ టోర్నీలో మొత్తం 33 మ్యాచ్‌లు ఏడు వేదికల్లో జరగనున్నాయి. జూన్ 30, జూలై 2న సెమీ-ఫైనల్స్, జూలై 5న లార్డ్స్‌లో ఫైనల్ జరగనుంది.

## ఇండియా-ఏకు షాకిచ్చిన ఆఫ్ఘనిస్తాన్..

**- 4 రన్స్ తేడాతో విక్టరీ**



**దంబుల్లా:**
ఇండియా-ఏ జట్టుకు ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు షాక్ ఇచ్చింది. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా ఇవాళ జరిగిన మ్యాచ్ లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నాలుగు రన్స్ తేడాతో ఆఫ్ఘనిస్తాన్ విజయం సాధించింది. పలు మార్లు వర్షం వల్ల మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా 49 ఓవర్లలో 349 రన్స్ చేసింది. కానీ ఆఫ్ఘన్‌కు 38 ఓవర్లలో 294 రన్స్‌ను టార్గెట్‌గా ఇచ్చారు. అయితే ఆఫ్ఘన్ బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. వర్షం అంతరాయం వల్ల మ్యాచ్ నిలిచిపోయే సమయానికి ఆఫ్ఘనిస్తాన్ 25.5 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 177 రన్స్ చేసింది.అయితే డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆఫ్ఘన్ జట్టు నాలుగు పరుగులు ఆధిక్యంలో ఉన్నది. దీంతో అనూహ్యంగా ఇండియా-ఏ జట్టుకు షాక్ తగిలింది. ఆఫ్ఘన్ బ్యాటర్లలో ఇబ్రాన్ 75, బహిర్ షా 51 రన్స్ చేసి క్రీజ్‌లో ఉన్నారు. భారత జట్టులో ప్రభ్ సిమ్రన్ సింగ్ 84, తిలకవ్ వర్మ 66, రుతురాజ్ గైక్వాడ్ 66, వైభవ్ సూర్యవంశీ 44 రన్స్ చేశారు. అయితే ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో ఇబ్రాన్, బహిర్ మధ్య మూడో వికెట్లకు అజయేంగా 108 రన్స్ భాగస్వామ్యం ఏర్పడింది. ఇది ఆ జట్టుకు కలిసి వచ్చింది.

## 2027 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

**అక్టోబర్ 4 నుండి ఐసీసీ వన్డే ప్రపంచకప్**

క్రికెట్ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదరుచూస్తున్న ఐసీసీ మెన్స్ వన్డే వరల్డ్ కప్ తాత్కాలిక షెడ్యూల్ వచ్చేసింది. అక్టోబర్ 4 నుండి నవంబర్ 21 ఈ మెగా టోర్నీ జరగనున్నట్టు తెలుస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలలో ఈ మ్యాచ్‌లు జరగనున్నట్టు తెలుస్తోంది. గత నెలలో అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఐసీసీ బోర్డు మీటింగ్ ఈ తేదీలపై ఏకాభిప్రాయం కుదిరిందని.. జూలైలో ఎడిన్‌బర్గ్‌లో జరగబోయే ఐసీసీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ తేదీలపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని నివేదికలు స్పష్టం చేశాయి. ఈ నివేదిక ప్రకారం..ఈ మెగా టోర్నీలోని మెజారిటీ మ్యాచ్‌లు దక్షిణాఫ్రికాలోనే జరగనున్నట్టు తెలుస్తోంది. ఈ టోర్నమెంట్ మొత్తంలో 54 మ్యాచ్‌ల జరగనుండగా అందులో సుమారు 41 మ్యాచ్‌లుకు దక్షిణాఫ్రికాలోని 8 స్టేడియాలు ఆతిథ్యం ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఇక జింబాబ్వేలోని విక్టోరియా ఫాల్స్,




హరారే స్పోర్ట్స్ క్లబ్, బులవాయోలోని క్వీన్స్ స్టేయాల్లో 8 నుండి 10 మ్యాచ్‌లు జరగనుండగా మిగతా మూడు మ్యాచ్‌లు నమీబియాలో జరగనున్నాయి. అయితే ఇప్పటి వరకు టీ20 ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ, మహిళల టీ20 ప్రపంచ కప్‌లకు ఆతిథ్యం ఇచ్చిన సౌత్రాఫ్రికా 2003 మూడు తర్వాత తొలిసారి మెన్స్ వరల్డ్ కప్ టోర్నమెంట్‌ను నిర్వహించబోతుంది. అయితే ఈ వరల్డ్ కప్ టోర్నమెంట్‌ను పాత పద్ధతిలోనే నిర్వహించబోతుంది. గతంలో జరిగిన రెండు ఎడిషన్లలో కేవలం 10 జట్లే పాల్గొనగా.. తాజాగా 2027లో జరగబోయే మెన్స్ వరల్డ్ కప్‌లో మళ్లీ 14 జట్ల ఫార్మాట్‌ను తీసుకురాబోతున్నారు.. అంటే మొత్తం 14 జట్లను రెండు గ్రూప్‌లుగా డివైడ్ చేసి.. ప్రతి గ్రూప్ నుండి టాప్ 3 స్థానాల్లో నిలిచిన జట్లను సూపర్ సిక్స్‌కు ఎంపిక చేస్తారు. ఇక ఐసీసీ సభ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వేలు దీనికి నేరుగా అర్హత సాధించగా, నమీబియా మాత్రం క్వాలిఫికేషన్ మ్యాచ్ ఆడిన తర్వాత సూపర్ సిక్స్‌కు రావాల్సి ఉంటుంది.